# ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత మంగళవారం గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY 5



శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

బుధవారం 9 జూలై 2025




# కేసు ఉంది.. అరెస్టు చేస్తాం..!

ఎక్కడున్నారో చెబితే వస్తాం..!

- బెదరగొడుతున్న సైబర్ నేరగాళ్లు
- పోలీసుల పేరిట బెదిరింపు కాల్స్
- బురిడీ కొట్టించి.. రూ.లక్షల్లో దోపిడీ



హిందూపురం, జూలై 8(ఆంధ్రజ్యోతి): నకిలీ పోలీసులు ఆగడాలు మితిమీరిపోతున్నాయి. వారం రోజుల క్రితం హిందూపురం మండలానికి చెందిన రాజకీయ నాయకుడికి బెంగళూరు సిటీ నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. 'నేను రవిచంద్ర.. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతున్నాను.. మీరు ఎక్కడున్నారు, మీపై బెంగళూరు సిటీలోని పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. ఎక్కడున్నారో చెబితే అక్కడికే వస్తాం' అని చెప్పారు. అంతటితో ఆగకుండా వీడియో కాల్ రిసీవ్ చేయమన్నారు. సదరు నాయకుడు వీడియోకాల్ రిసీవ్ చేయడంతో బెంగళూరు సిటీ పోలీస్ అనే బోర్డు కూడా కనిపించింది. వెంటనే తాను చెప్పినట్లు చేస్తే ఓకే లేదా మీరు ఉన్నచోటుకే వచ్చి తీసుకెళ్తామని హెచ్చరించారు. సదరు నాయకుడు మొదట కొంత గాబరా పడ్డాడు. కొద్దిసేపటికి తేరుకుని.. తనపై బెంగళూరులో ఏమి కేసు ఉందని ప్రశ్నించాడు. స్థానిక పోలీసులతో మాట్లాడి చెబుతా అన్నాడు. నకిలీ పోలీసని తెలుసుకుని ఆ నంబరుకు తిరిగి ఫోన్‌చేస్తే మొదట మాట్లాడారు. ఆ తరువాత స్విచ్‌ఆఫ్ చేసుకున్నారు.

- నెల క్రితం హిందూపురం పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లికి చెందిన ఓ ప్రముఖ చీరల వ్యాపారికి గోవా పోలీసులం మాట్లాడుతున్నామని కాల్ చేశారు. 'మీ కుమారుడు ఇక్కడికి వచ్చి డ్రగ్స్ కేసులో పట్టుబడ్డాడు. మేం చెప్పినట్లు చేస్తే వెంటనే వదిలేస్తాం.. లేదంటే మీ ఇష్టం' అన్నారు. చీరల వ్యాపారి కొడుకు తరచూ గోవాకు వెళ్లివచ్చేవాడు. దీంతో వెంటనే తన కుమారుడికి ఫోన్‌చేస్తే స్విచ్‌ఆఫ్ వచ్చింది. దీంతో ఫోన్‌చేసిన

(మిగతా 6లో...)

## కాలువ పనులు త్వరగా చేపట్టాలి



కాలువ పొడిగింపు పనులు పూర్తి చేస్తే ఎలాంటి అడ్డంకులు లేకుండా సీబీఆర్‌కు నీరు వెళ్తుంది. కాలువలో నీరు పారితే ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లోని వండ్లతోటలకు ఎంతో ఉపయోగకరం. అధికారులు కాలువ పనులు త్వరగా పూర్తి చేయించాలి.

\- రామచంద్రారెడ్డి, రైతు, శివంపల్లి



పీఏబీఆర్ కుడికాలువ

# కాలక్షేపం..!

అటకెక్కిన పీఏబీఆర్ కుడి కాలువ పొడిగింపు

- టీడీపీ హయాంలో నిధులు మంజూరు
- ఐదేళ్లూ పట్టించుకోని వైసీపీ పాలకులు
- కూటమిపై అన్నదాతల ఆశలు

తాడిమర్రి, జూలై 8(ఆంధ్రజ్యోతి): పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) కుడి కాలువ పొడిగింపును గత వైసీపీ పాలకులు అటకెక్కించారు. రెండంటే రెండు కిలోమీటర్లు కాలువ తవ్వలేకపోయారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్)కు నీటిని తరలించేందుకు 2017లో కుడి కాలువ పొడిగింపునకు అనుమతులు ఇచ్చారు. ప్రస్తుతం కాలువ ఉన్న 112 కిలోమీటరు వద్ద నుంచి మరో 2 కిలోమీటర్లు తవ్వితే పీబీఆర్‌లోకి నీటికి కలపొచ్చు. దీనికిగాను రూ.9.50కోట్లు అప్పట్లోనే నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఉన్న కుడికాలువ ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 42 చెరువులకు తాగు, సాగు నీరు అందిస్తున్నారు. మండలంలోని ఏకపాదంపల్లి, పిన్నదరి, పుల్లప్పల్లి, పుల్లానారాయణపల్లి, తాడిమర్రి, మేడిమాకులపల్లి, అగ్రహారం చెరువులకు నీరిస్తున్నారు. ఈ కాలువను మరో రెండు కిలోమీటర్లు పొడిగించి ఏటా మూడు టీఎంసీల నీరు సీబీఆర్‌కు తరలించేలా అప్పట్లో అనుమతులు పొందారు. తద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పీఏబీఆర్ కుడికాలువ వెంబడి భూముల్లో భూగర్భ జలమట్టాలు పెరగడమే కాకుండా ప్రస్తుతం చిత్రావతి నీటిని తరలించేందుకు అవుతున్న కోట్ల రూపాయల ఖర్చు మిగిలిపోతుంది.

### కొత్త ప్రభుత్వంపై ఆశలు

వైసీపీ ఐదేళ్ల పాలనలో కాలువ పొడిగింపును పట్టించుకున్న పాపాన పోలేదు. తద్వారా రైతుల ఆశలపై గండికొట్టింది. గతేడాది ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ యాదవ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ దృష్టికి కాలువ పొడిగింపు విషయాన్ని రైతులు తీసుకెళ్లారు. అధికారం చేపట్టగానే పనులు చేయిస్తామని అప్పట్లో వారు హామీ ఇచ్చారు. కూటమి అధికారంలోకి రావడం, మంత్రి సత్యకుమార్ యాదవ్ మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో అన్నదాతల్లో ఆశలు పెరిగాయి. కాలువ పొడిగింపు పనులు చేపడతారని భావిస్తున్నారు.

### లిఫ్ట్ ద్వారా నీరు..

సీబీఆర్‌కు దిగువన కడప జిల్లాలో ఉన్న గండికోట రిజర్వాయర్ నుంచి లిఫ్ట్ విధానంలో నీరు వస్తోంది. గండికోట నుంచి కడప జిల్లాలోని దుక్కుపల్లి వరకు గ్రావిటీ ద్వారా నీరు సరఫరా అవుతుంది. అక్కడి నుంచి రెండుచోట్ల లిఫ్టులు ఏర్పాటు చేసి నీటిని సీబీఆర్‌కు తోడుతున్నారు. రిజర్వాయర్‌లోని నీటిని లింగాల కుడికాలువ ద్వారా మళ్లీ పులివెందులకు గ్రావిటీ ద్వారా తరలిస్తున్నారు. కుడికాలువ ద్వారా నీటిని తరలించడంతో పాటు పార్నపల్లి ఏటి ద్వారా నీటిని తరలిస్తే తిరిగి నీరు గొడ్డుమర్రి వద్దకే చేరుతుంది. ఆ తరువాత దుక్కుపల్లి వరకు వెళ్లే అవకాశం ఉంది. పైనున్న పీఏబీఆర్ కుడికాలువ ద్వారా చిత్రావతికి నీటిని తరలించడం అటు ఉంచి అధికారులు ఎత్తిపోతల ద్వారా నీటిని తరలించేందుకు ఎందుకు మక్కువ చూపుతున్నారో అర్థం కావట్లేదు.





### కాలువ పక్కనే తోట



పీఏబీఆర్ కుడికాలువ పక్కనే మాకు చీనీ తోట ఉంది. పంటకు నీరు చాలక ఇబ్బందులు పడుతున్నాం. కుడి కాలువ ద్వారా నీటిని సీబీఆర్‌కు తరలిస్తే పుష్కలంగా నీరు లభిస్తుంది.

\-వెంకటరాముడు, రైతు, మేడిమాకులపల్లి

## సొసైటీలకు త్రిసభ్య కమిటీల నియామకం

పుట్టపర్తి టౌన్/రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదవీకాలం ముగిసిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘా (సొసైటీ)లకు త్రిసభ్య కమిటీలను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో 54 సొసైటీలు ఉన్నాయి. వీటిలో 21 సంఘాలకు కమిటీలను నియమించారు. కమిటీలో అధ్యక్షుడు, ఇద్దరు సభ్యులు ఉంటారు. కోడూరుకు నాగార్జున, అల్లాపల్లికి నారాయణప్ప, ఓబుళదేవరచెరువుకు తుమ్మల మహబూబ్ బాషా, పాలసముద్రానికి జయచంద్ర, కొండూరుకు నరసింహులు, పరిగికి చెన్నక్రిష్టారెడ్డి, అమడగూరుకు గంగిరెడ్డి, గాండ్లపెంటకు రామాంజులరెడ్డి, మల్లయ్యగారిపల్లికి నరసింహులు, సైదాపురానికి పోలినేని సుజాత, నల్లమాడకు బడా రమణారెడ్డి, అగళికి కుమారస్వామి, రొళ్లకు దాసిరెడ్డి, బుక్కపట్నానికి చెన్నకృష్ణ, గూనిపల్లికి ప్రభాకరరెడ్డి, మారాలకు అప్పస్వామి, బండ్లపల్లికి శంకరప్ప, పెడపల్లికి కొండూరు విజయకుమార్, వెంగలమ్మచెరువుకు ఆర్ శ్రీరామిరెడ్డి, రామగిరికి ముత్యాలప్పను నియమించారు. వీరి పదవీకాలం నెల మాత్రమే. పుట్టపర్తి సొసైటీ చైర్మన్‌గా వెంకటరాముడు అక్టోబరు 30వ తేదీ వరకు కొనసాగనున్నారు.

## మిరపా.. వద్దులే..!

- పంట సాగుకు ఆసక్తి చూపని రైతులు
- అరకొర దిగుబడులు, ధరలతో తీవ్ర నష్టం
- ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మొగ్గు

6



సిద్ధం చేసుకున్న మిరప విత్తనాలు

## మరింత భద్రత కల్పించండి

- ఆర్పీఎఫ్ డీఐజీ



పరికరాలను పరిశీలిస్తున్న ఆర్పీఎఫ్ డీఐజీ సధాన్‌జెమ్ ఖాన్

ధర్మవరం, జూలై8(ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రయాణీకులకు మరింత భద్రత కల్పించాలని ఆర్పీఎఫ్ సిబ్బందికి రైల్వే డీఐజీ సధాన్‌జెమ్‌ఖాన్ ఆదేశించారు. మంగళవారం ధర్మవరం ఆర్పీఎఫ్ పోలీసు స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆర్పీఎఫ్ కార్యాలయంలో పరికరాలను పరిశీలించారు. ఆర్పీఎఫ్ మహిళా వసతి గృహం ఆవరణలో మొక్కలను నాటారు. డీఐజీ మాట్లాడుతూ.. ప్రయాణికులకు భద్రత పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో గుంతకల్లు డివిజనల్ ఆర్పీఎఫ్ సెక్యూరిటీ కమిషనర్ ఆకాష్‌కుమార్ జైస్వాల్, సీఐ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## అప్పు చెల్లించమన్నందుకే హత్య

మహిళ హత్యకేసులో నిందితుడి అరెస్టు

7

## త్వరలో రెండో విడత

- జిల్లాలో 3,869 మంది లబ్ధిదారులకు పెండింగ్
- సచివాలయ గ్రీవెన్స్‌లో తల్లిదండ్రుల వినతి
- 'తల్లికి వందనం' సమస్యల పరిష్కారానికి అధికారుల చర్యలు



తాడిమర్రి సచివాలయంలో తల్లికి వందనం గ్రీవెన్స్ కోసం ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులు (ఫైల్)

ధర్మవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): త్వరలో తల్లికి వందనం పథకం రెండో విడత నిధులను రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేయనుంది. జిల్లా వ్యాప్తంగా 3869 మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకం కింద నగదు అందాల్సి ఉంది. అర్హత ఉన్నా చాలామందికి మొదటి విడతలో తల్లికి వందనం నగదు జమకాలేదు. ఇలాంటివారంత సచివాలయాల్లో వినతులు అందించారు. ఇందులో చాలామందికి రెండో విడతలో నగదు జమ అయ్యే అవకాశం ఉంది. విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు నగదు జమ కాకపోవడానికి కారణాలను తెలియజేస్తూ పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఇప్పటికే కొంత మందికి పరిష్కారమై డబ్బులు కూడా తల్లి ఖాతాలో జమ అయ్యాయి. జిల్లాలో విద్యార్థి ఆధార్ లింకు లేనివి 1613, విద్యార్థి, తండ్రి, ఆధార్ ఒక్కటే ఉన్నవి 197, విద్యార్థి, తల్లి ఆధార్ ఒకేవిధంగా ఉన్నవి 158, ఇలా జిల్లాలో తల్లికి వందనం డబ్బులు పడని విద్యార్థులు వేలమంది ఉన్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం ఈనెల 10న రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలో చదువుతున్న పిల్లల తల్లిదండ్రుల తో ప్రత్యేక సమావేశం జరపనుంది. ఈక్రమంలోనే తల్లికి వందనం రెండో విడత నగదు తల్లుల ఖాతాలోకి జమ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

### ప్రతి విద్యార్థికీ అందేలా చూస్తాం: కిష్టప్ప, డీఈఓ

జిల్లా వ్యాప్తంగా 3869 మంది విద్యార్థుల తల్లి ఖాతాల్లోకి తల్లికి వందనం పథకం కింద నగదు జమకాలేదు. వాటిని క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు సమాచా రం అందిస్తున్నాం. కొంతమంది తల్లిదండ్రులు వాటికి సంబంధించిన పత్రాలను సచివాలయాల్లో అందజేసి సరి చేసుకుంటున్నారు. అప్పుడు వీరికి కూడా రెండో విడతలో నగదు జమవుతుంది.

## పీటీఎంలను జయప్రదం చేయండి: కలెక్టర్



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

కొత్తచెరువు, జూలై 8(ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్(లను విజయవంతం చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలో ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించుకోవాలని కోరారు. ఎస్పీ రత్నతో కలిసి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ నెల 10న మెగా పీటీఎంకు సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వస్తారని తెలిపారు.

### సీఎం పర్యటన ఇలా...

సీఎం చంద్రబాబు సత్యసాయి విమానాశ్రయంలో దిగుతాఒరు. రోడ్డు మార్గాన జూనియర్ కళాశాలకు చేరుకుంటారు. విద్యార్థులతో సమావేశమవుతారు. అనంతరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులతో మాట్లాడతారు. క్రీడామైదానంలో జరిగే బహిరంగ సమావేశంలో పాల్గొంటారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులతో కలిసి మధ్యాహ్నం సహపంక్తి భోజనం చేస్తారు. అక్కడి నుంచి పెనుకొండ రోడ్డు మీదుగా పుట్టపర్తి వెళ్తారు. ఎస్పీ రత్న మాట్లాడుతూ.. సీఎం పర్యటనలో భాగంగా బందోబస్తును పటిష్ఠం చేసినట్లు వెల్లడించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఏర్పాట్లు చేశామన్నారు. పుట్టపర్తి డిపో నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు జానకంపల్లి మీదుగా బుక్కపట్నం, కొత్తచెరువు మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్తాయని ఎస్పీ తెలిపారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, పోలీసులు పాల్గొన్నారు. ఇంటర్ బోర్డు కమిషనర్ రుతికశుక్లా ప్రభుత్వ కళాశాలలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. తల్లికి వందనం పొందిన విద్యార్థులతో ఆమె ముచ్చటించారు.

## రాయలసీమకు సామాజిక న్యాయం చేయాలి

మానవ హక్కుల వేదిక రాష్ట్ర నేత ఎస్ఎం బాషా

7

# మూడు మారలే..!

- పురం వైసీపీలో ఫ్యాన్ మూడు ముక్కలు
- వైఎస్ జయంతి రోజు బహిర్గతమైన వర్గపోరు
- పార్టీ దిగజారిపోయిందన్న నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న నవీన్‌నిశ్చల్

హిందూపురం, జూలై 8(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేదికగా పురం వైసీపీలో వర్గపోరు మరోమారు బహిర్గతమైంది. ఏపార్టీలోనైనా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నాయకులు అందరూ ఏకతాటిపై ఉండటం సహజం. పురం వైసీపీలో మాత్రం ఇందుకు విరుద్ధంగా జరుగుతోంది. హిందూపురంలో మంగళవారం జరిగిన వైఎస్ఆర్ జయంతి వేడుకలను మూడుచోట్ల మూడు వర్గాలుగా విడిపోయి జరుపుకున్నారు. ఇందులో ప్రస్తుత సమన్వయకర్త దీపిక తన కార్యాలయం వద్దనే కార్యక్రమం జరిపారు. దీనికి పార్టీ నియోజకవర్గ పరిశీలకులు హాజరయ్యారు. కార్యక్రమంలో చౌళూరు మధుమతి కూడా పాల్గొన్నారు. ఆగ్రోస్ మాజీ చైర్మన్ నవీన్‌నిశ్చల్ టీచర్స్‌కాలనీలోని తన కార్యాలయం వద్దే జయంతి వేడుకలు జరుపుకున్నారు. మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి బైపాస్‌రోడ్డులో కార్యక్రమం నిర్వహించారు. ఇలా మూడుచోట్ల జయంతి వేడుకలు జరపడం పురంలో చర్చనీయాంశంగా మారింది.

### పరిశీలకుడి మాటలు బేఖాతరు

ఏదైనా రాజకీయ పార్టీలో అధిష్ఠానం నియమించిన వ్యక్తి ఆదేశాలను పాటించడం కద్దు. హిందూపురం వైసీపీలో అందుకు విభిన్నం. వైసీపీ నియోజకవర్గ పరిశీలకుడిగా నియమితుడైన రమేష్‌రెడ్డి హిందూపురం వచ్చినపుడు పార్టీని ఏకతాటిపై తెస్తామని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అయినా మంగళవారం జరిగిన వైఎస్ఆర్ జయంతి వేడుకలు మాత్రం ఎవరికి వారు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పరిశీలకుడు రమేష్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం సూచించిన మేరకు ఏకతాటిపై ఉండకుండా ఎవరికి వారుగా వ్యవహరిస్తే పార్టీ నుంచి సస్పెండ్ చేయడానికి వెనుకాడమని హెచ్చరించారు. ఆయన ఆదేశాలు, హెచ్చరికలు మిగిలిన నాయకులు పట్టించుకోలేదు.

### పురంలో పార్టీ దిగజారిపోయిందన్న నేతలు

ఇవన్నీ ఇలా ఉంటే మంగళవారం ఆగ్రోస్ మాజీ చైర్మన్ నవీన్‌నిశ్చల్ సమావేశంలో మాట్లాడుతూ హిందూపురంలో పార్టీ పరిస్థితి రోజు రోజుకు దిగజారిపోతోందన్నారు. దీనికి కారణం పార్టీ నాయకులేనని పేర్కొనడం ఆ పార్టీలో కలకలం రేపింది. పార్టీ వెంట ప్రజలు, ఓటర్లు ఉన్నారని పార్టీ నాయకుల వల్లే పార్టీ అధ్వాన పరిస్థితికి వచ్చిందని చెప్పుకొచ్చారు. ఈయనతోపాటు మరోనాయకుడు కూడా ఇటీవల అంతర్గత సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీని గాలికి వదిలేశారని దీనివల్ల నాయకులు, కార్యకర్తలు డోలాయమానంలో పడ్డారని పేర్కొన్నట్లు సమాచారం. కాగా జయంతి వేడుకల సందర్భంగా ఆయా సమావేశాల్లో ముగ్గురు నాయకులు మాట్లాడుతూ తమకంటే తమకే పార్టీ ఇన్‌చార్జ్ పదవి వస్తుందని చెప్పడం మరో విశేషం. ముఖ్యంగా ముగ్గురు నాయకులు వైఎస్ఆర్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడానికి ఇన్‌చార్జ్ పదవి కోసమేనని ఆ పార్టీలో నాయకులు, కార్యకర్తలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.



కమ్ముకున్న కారుమబ్బులు

# కురవని మేఘం..!

- కారుమబ్బులతో దోబూచులాట
- నేలరాలని చినుకు
- అన్నదాతల్లో ఆందోళన
- అదును దాటుతోందని భయం



చిలమత్తూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఆకాశంలో కమ్ముకుంటున్న మేఘాలు కరుణించకపోవడంతో రైతులకు నిరాశే మిగులుతోంది. కారుమబ్బుల మేఘాలు రైతన్నలను మురిపిస్తున్నాయి. మే నెలాఖరులో మోస్తరు వర్షాలు కురవడంతో రైతన్నల్లో సంతోషం వెల్లివిరిసింది. జూన్‌లో వరుణుడు ముఖం చాటేశాడు. జూలైలో వారం రోజులు గడిచినా చినుకు రాలకపోవడంతో ఈసారి ఇంతేనా అంటూ రైతుల్లో నిరాశ నెలకొంటోంది. మృగశిర కార్తెలో కురిసిన వర్షంతో పొలాలను ఖరీఫ్ సాగుకు సిద్ధం చేసుకున్నారు. కొందరు తొలకరి వర్షాలకు వేరుశనగ, మొక్కజొన్న పంటలను విత్తుకున్నారు. అప్పటి నుంచి చినుక నేల రాలకపోవడంతో మొలకెత్తిన పంటలు వాడుముఖం పడుతున్నాయి.

### దోబూచులాట..

రాష్ట్రంలో అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నా జిల్లాలో మాత్రం నెల రోజులుగా వరుణ దేవుడు కరుణించలేదు. కారుమబ్బులు దోబూచులాడుతూ రైతుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి. రోజూ భారీ వర్షం కురుస్తుందేమో అన్నట్లుగా ఆకాశం మేఘావృతమవుతోంది. కాసేపటికే ఉసూరుమంటున్నాయి. తుంపర్లు కూడా పడకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు.

### ఆకాశం వైపు చూపు

కారుమబ్బులతో రైతులను మభ్యపెడుతున్న వాన మేఘాలు చినుకు రాల్చకుండా దూసుకుపోతుండంటంతో రైతులు ఆకాశం వైపు చూస్తూ ఉండిపోతున్నారు. ఎప్పుడు వాన కురుస్తుంది? ఎప్పుడు (మిగతా 6లో...)

## వావ్వ్..నరుడు

- కోతి ప్రాణం నిలిపిన యువకులు

6

## అంతరాష్ట్ర దొంగ అరెస్టు

- రూ.12 లక్షల విలువైన ఆభరణాల స్వాధీనం


7



## పూ వలస..!







చెరువు నీటిలో
హాయిగా పెరుగుతుంటే..
పూసీ పుయ్యంగానే కోసి..
నిర్దయగా అమ్మేస్తున్నారు..!
అందమైన కమలపు జీవితం..
అర్థాంతరంగా ముగియాల్సిందేనా..?
ఓ వెన్నెల రాతిరి మాట్లాడుకున్నాం..!
మరువ నీటిలో మెల్లగా ఈదుతూ..
గుట్టుగా ఈ గుంతకు చేరాం..!
పెంచుకున్న ఈ పూల బంధాన్ని
ఇక్కడా తెంచేస్తారా..?
వదిలేయండి మమ్మల్నిలా..
స్వేచ్ఛగా!

**(ఎక్కడో చెప్పం.. వెతికి కోసుకుంటేనూ..)**

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి



# మిరపా.. వద్దులే..!

## పంట సాగుకు ఆసక్తి చూపని రైతులు

- అరకొర దిగుబడులు, ధరలతో తీవ్ర నష్టం
- ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మొగ్గు

### మొక్కజొన్న సాగు చేశా



నేను ప్రతీ ఏటా 15 ఎకరాల్లో మిరప సాగు చేసేవాడిని. గత ఏడాది 8 ఎకరాల్లో మిరప పంట పూర్తిగా దెబ్బతినింది. మిగిన 7 ఎకరాల్లో అంతో ఇంతో దిగుబడి వచ్చి పెట్టుబడి తిరిగి వస్తుంది అనుకున్నాను. అలా జరగక తీవ్రంగా నష్టం వచ్చింది. ఈ సారి కూడా 10 ఎకరాల్లో డబ్బీ రకం మిరప సాగు చేయాలని అనుకున్నా. మిరప పంటకు పెట్టు బడులు ఎక్కువ, ధరలు మాత్రం ఉండవు. ప్రతీ సారి అప్పుల్లోనే కూరుకుపోవాల్సి వస్తోంది. అందుకే ఈసారి మొత్తం మొక్క జొన్న పంట సాగు చేశా.

**-బొజ్జప్ప, రైతు, చీకలగురికి**

విడపనకల్లు, జూలై 8(ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధర లేక నష్టాలు వస్తుండటంతో ఈ ఏడాది మండల రైతులు మిరప సాగువైపు మొగ్గు చూపడం లేదు. గత ఏడాది ఉరవకొండ నియోజకవర్గంలో దాదాపుగా 40వేల ఎకరాల్లో మిరప సాగు చేశారు. ఈ ఏడాది కనీసం 30వేల ఎకరాల్లో అయినా సాగు చేస్తారా అనే సందేహం కలుగుతోంది. మండలంలో మిరప రైతుల సందడి ఎక్కడా కనిపించటం లేదు. గత ఏడాది ఒక క్వింటా డబ్బీ రకం విత్తనం రూ.70వేలు, కడ్డీ రకం విత్తనం రూ.65వేలు ప్రకారం కొనుగోలు చేశారు. ఈసారి క్వింటా రూ. 20వేలు, రూ.30వేలకు కూడా కొనటం లేదని వివిధ ప్రాంతాల్లో విత్తన దుకాణాల యజమానులు చెబుతున్నారు. కొందరు రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తున్నారు.



సిద్ధం చేసుకున్న మిరప విత్తనాలు

### నల్లతామరకు ఎదురు నిలిచి...

గత ఏడాది మిరప రైతులను నల్ల తామర పురుగు నిలువునా ముంచేసింది. కాయలు ఎర్ర బారుతున్న సమయంలో నల్లి పురుగు సోకింది. అధిక వర్షాలు కురువటం వల్ల నల్లిపురుగు సోకి కాయలు, పూత కుళ్లి పోయి దిగుబడి పడిపోయింది. అయినా రైతులు పంటలను కాపాడుకుని ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడిని సాధించారు. పండించిన పంటకు గిట్టు బాటు ధర లేకపోవటంతో కర్ణాటకలోని బ్యాడిగి, హుబ్లీ, బళ్లారి, విడపనకల్లు, గుంతకల్లు వంటి ప్రాంతాల్లోని ఏసీ గోడౌన్‌ల్లో నిల్వ చేశారు. కొంతమంది రైతులు 2023, 2024 రెండు సంవత్సరాల పంటను అలాగే ఉంచారు. గిట్టుబాటు ధరల కోసం ఎదురు చూసి పండించిన పంటలను ఏసీ గోడౌన్‌లోనే వదిలేశారు.



ఏసీ గోడౌన్‌లో నిలువ ఉన్న మిరప పంట

### మిరప మిషన్లకు తగ్గిన గిరాకీ

గత ఏడాది విత్తనాల కోసం రోజు 100 నుంచి 150 బస్తాలు మిరప కాయలను మిషన్లకు వేసేవారు. దీనికి కారణం రైతులు మిరప సాగుకు మొగ్గు చూపటం. ఈ ఏడాది జూలైలో ఓ వారం గడిచినా మిరప విత్తనాలు కోసం రైతులు రాకపోవటంతో విత్తన సాగు అంతంత మాత్రమే అనిపిస్తోంది. ప్రస్తుతం రోజుకు ఒక మిషన్‌కు 20 నుంచి 30 బస్తాలు కూడా ఆడించటం లేదు.

### మిరప రకాలు... దిగుబడులు

మిరప రకాన్ని బట్టి దిగుబడులు ఉంటాయి. సింజెంటా బ్యాడిగి రకం ఎకరాకు 22 నుంచి 26 క్వింటాళ్లు, గుంటూరు నాటీ వెరైటీ ఎల్‌సీ రకం 28 నుంచి 31 క్వింటాళ్లు, బీఎస్‌ఎఫ్ ఆర్మూర్ రకం 30 నుంచి 40 క్వింటాళ్లు, డబ్బి రకం ఎకరాకు 25 నుంచి 30క్వింటాళ్లు, గుంటూరు కారం కడ్డీ రకం 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయి.

### నాలుగు ఎకరాల్లో చాలనుకున్నా



నేను ప్రతి సంవత్సరం 12 ఎకరాల్లో మిరప సాగు చేసేవాడిని. గత ఏడాది దిగుబడి, గిట్టుబాటు ధరలు లేక చాలా నష్టపోయా. ఎకరాకు రూ. 10 వేల నుంచి 12వేలు విత్తనం ఖర్చు అవుతుంది. పెట్టు బడులు రూ. లక్షల్లోనే వస్తున్నాయి. దిగుబడి ఉన్నా గిట్టుబాటు ధరలు రావు. ప్రతీ ఏటా రూ. లక్షల్లో అప్పులు పాల వుతున్నా. అందుకే ఈ ఏడాది నాలుగు ఎకరాల్లోనే మిరప సాగు చేయాలనుకుంటున్నా.

**-పురుషోత్తం, రైతు, ఆర్ కొట్టాల**

---

## కేసు ఉంది.. అరెస్టు చేస్తాం..!

(5వ పేజీ తరువాయి)



నకిలీ పోలీసులకు రూ.2లక్షలు నగదును బదిలీ చేశాడు. కొద్ది సేపటి తరువాత కుమారుడి ఫోన్ ఆన్‌కావడంతో ఎక్కడున్నావని ఆరాతీయగా.. తాను బెంగళూరులో ఉన్నానని చెప్పాడు. ఫోన్‌చేసినది నకిలీ పోలీసులని తెలుసుకుని మిన్నకుండిపోయారు.

- రెండు నెలల క్రితం పట్టణంలోని డీఆర్ కాలనీలో నివాసమున్న ఓ రియల్టర్‌కు ఫోన్‌కాల్ వచ్చింది. 'మీ కుమార్తె బెంగళూరులో పబ్బుకు వెళ్లి పోలీసులకు పట్టుబడింది. మేం చెప్పినట్లు వింటే వదిలేస్తాం' అని చెప్పారు. నిజమేననుకుని రియల్టర్ రూ.50వేలు బదిలీ చేశాడు. తరువాత అది చాలదంటూ మరింత వేయమని డిమాండ్ చేశారు. దీంతో తండ్రి గాబరాపడి కుమార్తెను ఆరాతీయగా తాను కళాశాలలోనే ఉన్నానని చెప్పడంతో ఆ రియల్టర్ మోసపోయానని స్థానిక పోలీసులవద్ద వాపోయాడు.
- పై ముగ్గురేకాదు ఆరు నెలల వ్యవధిలో హిందూపురం పట్టణంలో 50మందికి పైగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్ ట్రేడింగ్ చేస్తే భారీ లాభాలు వస్తాయని, టాస్క్ పూర్తిచేస్తే లక్షల్లో లాభాలు చూడవచ్చని నిలువునా మోసం చేసిన నేరగాళ్లు ఇటీవల రూటుమార్చి నకిలీ పోలీసుల అవతారమెత్తారు. మీపేరుపై డ్రగ్స్, మత్తుపదార్థాలు వచ్చాయంటూ బెదిరించి అరెస్ట్ చేస్తామని డబ్బులు దోచేస్తున్నారు.

### ఫోన్‌లోనే సెటిల్‌మెంట్

బాధితుల్లో ఎక్కువగా ప్రభుత్వ, ప్రైవేట్, విశ్రాంత ఉద్యోగులు, అధ్యాపకులు, వైద్యులు, వ్యాపారాలు చేసే ఉన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో నేరగాళ్లు వల విసురుతున్నారు. బాధితుల సెల్‌ఫోన్‌లను హ్యాక్‌చేసి వాటిలోని సమాచారాన్ని తస్కరిస్తున్నారు. ఆ తరువాత ఫోన్‌చేసి తాము ముంబాయి, ఢిల్లీ, చెన్నై, గోవా, హైదరాబాద్, కలకత్తా పోలీసులమంటూ నమ్మబలుకుతున్నారు. మీ పేరుపై డ్రగ్స్ పార్శిల్ వచ్చిందని విమానాశ్రయాల్లో రైల్వే స్టేషన్‌లు, బస్టాండులో పట్టుకున్నామని బెదిరించి అరెస్ట్ చేయడానికి వస్తున్నామంటూ హెచ్చరించి సాధ్యమైనంత దోచేస్తున్నారు. అరెస్ట్ ఆపాలంటే కొంతమొత్తం అధికారులకు ఇవ్వాల్సి ఉంటుందని, తన ఖాతాకు వెంటనే జమచేయాలని చెప్పి ఆన్‌లైన్ ద్వారావేయించుకుంటున్నారు.

### ముఖ్య నాయకులకే బెదిరింపు కాల్స్

కొంతకాలం వరకు సైబర్ నేరగాళ్లు అమాయకులపైనే వల విసిరారు. ఇప్పుడు ఏకంగా ప్రముఖంగా వినిపించే వ్యక్తుల పైనే గురి పెడుతున్నారు. ఇటీవల హిందూపురంలో నకిలీ పోలీసులు చేసిన ఫోన్‌కాల్స్‌ను బట్టి చూస్తే కొంతమంది రియల్టర్లు మరికొందరు పేరుమోసినవారు ఉండటం ఆందోళన కలిగించే విషయం. మరికొంతమంది సైబర్ నేరగాళ్లబారిన పడి మోసపోయినా చెప్పలేక మదనపడుతున్నారు. దీంతో ఆన్‌లైన్‌లో సైబర్ నేరగాళ్లు విసురుతున్న వలకు చిక్కి లక్షల్లో పోగొట్టుకుంటున్నారు.

### ఫోన్‌కాల్స్‌ను నమ్మకండి



సైబర్ నేరగాళ్లు పోలీసులమని బెదిరించి మోసగిస్తున్న ఉదంతాలపై కొంతమంది మాకు చెబుతున్నారు. కానీ లిఖితపూర్వకంగా ఫిర్యాదులు ఇవ్వలేదు. ఇస్తే ఆ నకిలీ పోలీసులపై చర్యలు తీసుకునేందుకు ఆస్కారం ఉంటుంది. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. నిజమైన పోలీసులు ఎప్పుడూ అరెస్ట్ చేస్తామని బెదిరించరు. ఆన్‌లైన్‌లో సంప్రదింపులు చేయరు. అలాంటి ఫోన్‌కాల్స్ వస్తే నమ్మి మోసపోకండి. ఎవరైనా మెసేజ్‌లుపెట్టినా, ఫోన్‌లు చేసినా పోలీసులను సంప్రదించండి.

- మహేష్, డీఎస్పీ, హిందూపురం

---

## విలువలపై వేసవి తరగతులు



భగవాన్ మిషన్ వాల్యూషన్ లోగోను విడుదల చేస్తున్న ట్రస్టు సభ్యులు రత్నాకర్, చక్రవర్తి

పుట్టపర్తి, జూలై 8(ఆంధ్రజ్యోతి): సత్యసాయి విద్యార్థులకు రెండో రోజు మంగళవారం విలువలపై వేసవి తరగతులను నిర్వహించారు. సాయికుల్వంతు సభామండపంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ విశాల్‌రావు సత్యసాయి బోధనాతత్వం, ప్రేమతత్వంపై ప్రసంగించారు. సత్యసాయి మిషన్ ఆఫ్ వాల్యూషన్ లోగోను శ్రీసత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్‌ట్రస్టీ ఆర్‌జేరత్నాకర్, సభ్యులు చక్రవర్తి, సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్ పాండే, యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ రాఘవేంద్రతో కలిసి ఆవిష్కరించారు. సత్యసాయి సేవలు, విలువలపై బుక్‌లెట్‌ను విడుదల చేశారు. అనంతపురం మహిళా క్యాంపస్ ఏర్పాటుచేసి 54 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కళాశాల విద్యార్థినులు భక్తి నివేదనం పేరిట భక్తిపాటలు ఆలపించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



పాటలు పాడుతున్న విద్యార్థినులు

## సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు: ఎస్పీ రత్న

పుట్టపర్తిరూరల్, జూలై8(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా పర్యటనకు పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టినట్లు ఎస్పీ రత్న తెలిపారు. కొత్తచెరువు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఈనెల 10న మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ (పీటీఎం)కు ముఖ్యమంత్రి రానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను మంగళవారం ముఖ్యమంత్రి భద్రతాధికారులతో కలిసి ఎస్పీ పరిశీలించారు. శ్రీసత్యసాయి విమానాశ్రయం నుంచి కాన్వాయ్ వెళ్లే మార్గం, సభా వేదిక, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. అక్కడ తసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు విజయ్‌కుమార్, నర్సింగప్ప, హేమంత్‌కుమార్, శివనారాయణస్వామి, శ్రీనివాసులు, ఎస్పీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.

### ట్రాఫిక్ మళ్లింపు

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లించినట్లు జిల్లా పోలీసులు తెలిపింది. ధర్మవరం వైపు నుంచి వచ్చే వాహనాలు మైలసముద్రం, నారేపల్లి, బుచ్చయ్యగారిపల్లి, కర్ణాటక నాగేపల్లి మీదుగా పుట్టపర్తికి రావాలన్నారు. పెనుకొండ వైపు నుంచి వచ్చే వాహనాలు సాయినగర్ క్రాస్‌నుంచి జగరాజుపల్లి, జగరాజుపల్లి క్రాస్, బడేనాయక్‌తాండా, బీడుపల్లి, బ్రాహ్మణపల్లి, గణేష్‌సర్కిల్, చిత్రావతి బైపాస్, గోరంట్ల వైపు నుంచి వచ్చే వాహనాలు జగరాజుపల్లి, జగరాజుపల్లి క్రాస్, బడేనాయక్‌తాండా, బీడుపల్లి, బ్రాహ్మణపల్లి, గణేష్‌సర్కిల్, చిత్రావతి బైపాస్, కర్ణాటకనాగేపల్లి, ముదిగుబ్బ వైపు నుంచి వచ్చే వాహనాలు నాగానందపల్లి, జానకంపల్లి, కర్ణాటకనాగేపల్లి వైపు వెళ్లాలన్నారు. కదిరి వైపు నుండి వచ్చే వాహనాలు తాత్కాలికంగా కర్ణాటకనాగేపల్లి బ్రిడ్జి వద్ద పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. వాహనదారులు గమనించాలని కోరారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ ముఖ్యమంత్రి భద్రతాధికారులు

## నీరు అడిగి.. చైన్ లాగేశాడు..

అనంతపురం క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): తాగడానికి నీరు అడిగి వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు లాగేశాడు దుండగుడు. అనంతపురం రూరల్ మండలంలోని నందమూరినగర్‌లో మంగళవారం మధ్యాహ్నం పద్మావతమ్మ(60) మెడలోని చైన్‌ను దుండగుగు లాక్కెళ్లాడు. పద్మావతమ్మ, ఆమె భర్త రమణయ్య చిన్న కొట్టు నడుపుకుంటున్నారు. మంగళవారం మధ్యాహ్నం 2.50 గంటల ప్రాంతంలో ఓ దుండగుడు వచ్చి తాగడానికి నీరు ఇవ్వమని ఆమెను అడిగాడు. ఆమె నీరు తీసుకొచ్చేందుకు ఇంట్లోకి వెళ్తుండగా దుండగుడు వెనుక వైపు నుంచి ఆమె మెడలోని రెండున్నర తులాల గొలుసు లాక్కుని పరారయ్యాడు. ఆమె తేరుకుని, కేకలు వేసేలోగా...దుండగుడు పరారయ్యాడు. రూరల్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేశారు.



బాధితురాలు పద్మావతమ్మ

## ప్రమాదంపై కేసు నమోదు

అనంతపురం క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంపై ట్రాఫిక్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ధర్మవరానికి చెందిన ఈశ్వరయ్య(54)ను సోమ వారం రాత్రి ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన విషయం తెలిసిందే. దీనిపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఢీకొట్టిన వాహనం ప్రైవేటు ఫైనాన్స్‌లో ఉన్నట్లు తెలిసింది. ఢీకొట్టిన వ్యక్తి, వాహన యజమాని వేర్వేరా.. ఇద్దరూ ఒక్కరేనా అనే కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నారు.

## కురవని మేఘం..!

(5వ పేజీ తరువాయి)

విత్తనాలు విత్తుకుంటాం? అనే చింతలో ఉండిపోతున్నారు. ఇప్పటికే మే నెలలో కురిసిన ఓ మోస్తరు వర్షానికి పొలాలను దుక్కి చేసుకుని, విత్తనాలు విత్తేందుకు సిద్ధంగా ఉన్నారు. వర్షం కోసం ఎదురుచూసి కళ్లు కాయలు కాస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### గాలులతో నీరసిస్తున్న మొలకలు

ఇప్పటికే అడపాదడపా కురిసిన తుంపర్లకు విత్తుకున్న వేరుశనగ, మొక్కజొన్న పంటలు మొలకెత్తాయి. అవి విత్తినప్పటి నుంచి వర్షం లేకపోవడంతో మొలకలు నీరసించిపోయాయి. ఇలాగే వారంరోజుల పాటు వర్షాభావ పరిస్థితులు కొనసాగితే మొలకలు మిగలవని రైతులు పేర్కొంటున్నారు. ఆషాఢం గాలులు విపరీతంగా వీస్తున్నాయి. గాలులకు మొలకెత్తిన పంటలు సైతం ఎండిపోతున్నాయి. వర్షం కురిసే మేఘాలను సైతం ఈ గాలులు ప్రభావితం చేసి కరిగిపోయేలా చేస్తున్నాయి. దాంతో గాలుల వేగం తగ్గేవరకు వర్షం కురిసే అవకాశం లేదంటున్నారు రైతులు.



వర్షం లేక ఎండుతున్న మొక్కజొన్న

### మిగిలింది వారమే..

ఖరీఫ్‌లో పంటలు సాగు చేయాలంటే జూన్, జూలై నెలలు అదును. అందులో కూడా జూన్ నెలలో విత్తుకున్న పంటలే కొంత వరకు అధిక దిగుబడి ఇస్తాయి. జూలై 15 వరకు కూడా కొంత వరకు వేరుశనగ, మొక్కజొన్న పంటలకు సానుకూలమే. ఇప్పటికే జూలై నెలలో వారం రోజులు గడిచిపోయాయి. మిగిలింది వారమే. ఈలోగా వర్షం రాకపోతే ఆ తరువాత పంటలు విత్తుకున్నా ఫలితం ఉండదని రైతులు అభిప్రాయపడుతున్నారు.

### అదునులో విత్తుకుంటేనే పంట దిగుబడి



ఖరీఫ్‌లో వర్షాధారంగా అదునులో విత్తుకుంటేనే పంట దిగుబడి ఉంటుంది. సాధారణంగా జూన్, జూలై మొదటి వారంలో విత్తుకుంటే పంటలు చేతికందుతాయి. ఈ ఏడాది జూన్ నెల పూర్తిగా వర్షం లేదు. ఈ నెలలో కూడా విపరీతమైన గాలులు ఉంటున్నాయి తప్ప.. వర్షం లేదు. దాంతో ఇప్పటి వరకు పంటలను విత్తుకోలేకపోతున్నాం. ఇప్పుడైనా వర్షం కురిస్తే కొంతవరకు మేలు చేకూరుతుంది.

**- నరేంద్ర, రైతు, బందేపల్లి**

### వర్షం కోసం ఎదురుచూస్తున్నాం



నెల రోజులుగా ఈదురుగాలులు తప్ప.. చినుకు రాలలేదు. మబ్బులు కమ్ముకుంటూ రోజూ వర్షం వచ్చే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వానరాలేదు. వర్షాధారంగా మెట్ట భూముల్లో విత్తుకున్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. విత్తనాలు మొలకెత్తి నీరసంగా వాడిపోతున్నాయి. ఇప్పటికైనా వర్షం వస్తే కొంతవరకు గట్టెక్కగలం. లేదంటే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది.

**- నందకుమార్, రైతు, దేమకేతేపల్లి**

## వావ్..నరుడు

- కోతి ప్రాణం నిలిపిన యువకులు



కోతి ప్రాణాలు కాపాడుతున్న యువకులు

**పో**తున్న ప్రాణాన్ని తమ సపర్యలతో నిలిపి మానవత్వాన్ని చాటారు సోమందేపల్లికి చెందిన యువకులు. మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు పక్కన కంచె లేకుండా ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఓ కోతి మంగళవారం విద్యుదాఘాతానికి గురైంది. అపస్మారక స్థితిలో కింద పడి ఉన్న వానరాన్ని స్థానిక యువకులు గుర్తించారు. వెంటనే దానిపై నీళ్లు పోశారు. అయినా చలనం లేకపోవడంతో మనుషులకు చేసినట్లు దానికి సీపీఆర్ చేశారు. దీంతో ఆ మూగజీవిలో కాస్త చలనం వచ్చింది. కొద్ది సేపటి తర్వాత దానికి కాసిన్ని నీళ్లు తాపారు. ఒళ్లంతా చేతులతో నిమిరారు. కాస్త కోలుకున్న తర్వాత దానికి కొన్ని పండ్లు ఇచ్చారు. యువకుల సపర్యలు, ఆహారంతో శక్తి కూడదీసుకున్న ఆ మర్కటం స్థానికులకు కళ్లతోనే కృతజ్ఞతలు చెబుతున్నట్లుగా చూస్తూ, మెల్లగా చెట్టు కొమ్మలపైకి వెళ్లిపోయింది.

**-సోమందేపల్లి, ఆంధ్రజ్యోతి**

## నేటి సమ్మెను జయప్రదం చేయండి

### సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్



మాట్లాడుతున్న సీపీఐ జిల్లాకార్యదర్శి జాఫర్

అనంతపురం విద్య, జూలై 8(ఆంధ్రజ్యోతి): కేంద్రం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ బుధవారం నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రం 44 కార్మిక చట్టాలను కాలరాస్తూ కార్మిక వ్యతిరేక విధానాలను తీసుకొస్తోందన్నారు. ఈవ్యతిరేక చట్టాలను బీజేపీ పాలిత రాష్ట్రాలలో అమలు చేయకుండా ఇతర రాష్ట్రాలపై బలవంతంగా రుద్దేందుకు చూస్తోందని మండిపడ్డారు. కార్మికులకు పనివేళలు పెంచడం సరికాదని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, నల్లచట్టాల రద్దు, నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలని, తదితర డిమాండ్లతో చేపడుతున్న సార్వత్రిక సమ్మెకు అన్నివర్గాల ప్రజలు మద్దతు పలికి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నారాయణస్వామి, కేశవరెడ్డి, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

## పాయసం తిని పలువురికి అస్వస్థత



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

ఓబుళదేవరచెరువు, జూలై8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకుతోటపల్లిలో దేవుడికి నైవేద్యంగా సమర్పించిన పాయసం తిని 15మంది మంగళవారం అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు తెలిపిన మేరకు తొలి ఏకాదశి సందర్భంగా ఆకుతోటపల్లికి చెందిన బాలకృష్ణ ఇంటిలో పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా దేవుడికి నేవైద్యంగా పెట్టిన పాయసాన్ని సోమవారం సాయంత్రం పూజలు, భజనకు వెళ్లి భక్తులు తిన్నారు. అప్పటి నుంచి వాంతులు, విరేచనాలతో బాధపడ్డారు. 15మంది అస్వస్థతకు గురికాగా, 8మంది ప్రభుత్వ వైద్యశాలలో, మిగిలినవారు ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. వైద్యాధికారి భానుప్రకాష్‌నాయక్ మాట్లాడుతూ పాయం తినడం వల్లే అస్వస్థతకు గురయ్యారన్నారు. వైద్య బృందం ఆకుతోటపల్లిలో ఇంటింటా పర్యటించి అవసరం మేరకు వైద్యసేవలు అందిస్తామన్నారు. కాగా పాయసం తిని అస్వస్థతకు గురైన వారిని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి మంగళవారం పరామర్శించారు.

## ముగిసిన ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీలు

### ప్రొసీడింగ్స్ జారీ చేయడంలో సిబ్బంది నిమగ్నం

అనంతపురం న్యూటౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ మంగళవారం ముగిసింది. స్థానిక ఎస్ఈ కార్యాలయంలోని సమావేశ భవనంలో సీనియార్టీకి అనుగుణంగా 5 సంవత్సరాలు పూర్తయిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, గతనెల ఆఖరులో బదిలీలు ప్రక్రియ ముగించారు. మరో 5 రోజులు గుడువు పొడిగించడంతో 5వ తేదీలోపు పూర్తి చేయాల్సి ఉంది. తప్పిదాలను సరిదిద్దడంలో యంత్రాంగం నిమగ్నమైంది. సిఫార్సులకు అనుగుణంగా తుది జాబితా సిద్ధం చేయడానికి మరో రెండు రోజులు పట్టింది. ఎట్టకేలకు మంగళవారం జాబితాకు కలెక్టర్ ఆమోదం తెలపడంతో ప్రొసీడింగ్స్ జారీ చేయడంలో సిబ్బంది నిమగ్నమయ్యారు. ఐదేళ్లు పూర్తి చేసుకున్న 253 మందికి స్థానచలనం కల్పించారు. రిక్వెస్టు కింద 18 మందికి, అనారోగ్య కారణాలతో 8 మందిని బదిలీ చేశారు.

**పంచాయతీ కార్యదర్శులకు..**

ఉమ్మడి జిల్లాలోని గ్రేడ్-5, గ్రేడ్-6 (డిజిటల్ అసిస్టెంట్ల) బదిలీ ప్రక్రియ మంగళవారం ముగిసింది. అందుకు అనుగుణంగా ప్రిసీడింగ్స్ జారీ చేశారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి అనంతపురంలోని డీపీఓ కార్యాలయంలో గతనెల ఆఖరులో కౌన్సెలింగ్ నిర్వహించారు. తుది జాబితా సిద్ధం చేసి కలెక్టర్ ఆమోదానికి పంపారు. సిఫార్సులకు అనుగుణంగా అవకాశం కల్పించడానికి మరింత సమయం పట్టినట్లు తెలిసింది. ఎట్టకేలకు జాబితాకు కలెక్టర్ ఆమోదం తెలపడంతో మంగళవారం బదిలీల ప్రక్రియకు సంబంధించి ప్రొసీడింగ్స్ జారీ చేశారు.

## చేనేత డిజైనర్‌కు జాతీయ అవార్డు



డిజైనర్ నాగరాజు

ధర్మవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన చేనేత డిజైనర్ నాగరాజును డిజైన్ డెవలప్‌మెంట్‌లో జాతీయ అవార్డు వరించింది. చేనేత డిజైన్ డెవలెప్‌మెంట్, మార్కెటింగ్ హ్యాండ్‌లూమ్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఈనెల 7న న్యూఢిల్లీలో జాతీయ అవార్డులను ప్రకటించినట్లు డిజైనర్ నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా 19 అవార్డులను ప్రకటించగా మన ఆంధ్రప్రదేశ్‌కు 3 అవార్డులు వచ్చాయన్నారు. అవార్డును ఆగస్టు 7న న్యూఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోనున్నట్లు నాగరాజు తెలిపారు.

## మున్సిపల్ ఆర్డీగా రవీంద్రబాబు

### కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్‌గా విశ్వనాథ్ బదిలీ



రవీంద్రబాబు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ శాఖ ప్రాంతీయ సంచాలకుడి(ఆర్డీ)గా రవీంద్రబాబు నియమితుడయ్యారు. ఇక్కడ ఆర్డీగా పనిచేస్తున్న విశ్వనాథ్‌ను కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్‌గా బదిలీ చేశారు. కర్నూలు కమిషనర్‌గా పనిచేస్తున్న రవీంద్రబాబును ఆర్డీగా నియమిస్తూ ఆ శాఖ ప్రత్యేక కార్యదర్శి సురేష్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. రెండ్రోజుల్లో రవీంద్రబాబు ఆర్డీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

## ప్లేస్‌మెంట్లు ఖరారు

అనంతపురం న్యూటౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి పొందిన వారికి ప్లేస్‌మెంట్లు ఖరారు చేశారు. జిల్లా పంచాయతీ కార్యాలయం, ధర్మవరం డీఎల్‌పీఓ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న లీలాబాయి, విజయ్‌కుమార్, పామిడి గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి అశ్వత్థనాయుడుకు డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి కల్పించిన విషయం తెలిసిందే. వారికి డీపీఓ నాగరాజనాయుడు ప్లేస్‌మెంట్లు ఖరారు చేశారు. లీలాబాయి కంబదూరుకు, విజయ్‌కుమార్ శింగనమలకు, అశ్వర్థనాయుడు పామిడి డిప్యూటీ ఎంపీడీఓగా నియమించాలని రిక్వెస్టు పెట్టుకున్నారు. ఆ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## నా భర్త కనిపించట్లేదు

**ఎమ్మెల్యేకి ఫిర్యాదు**

నల్లమాడ, జూలై 8(ఆంధ్రజ్యోతి): తన భర్త రమణ కనిపించకుండా పోయాడని మండలంలోని దొన్నికోట గ్రామానికి చెందిన దేవరకొండ రాజేశ్వరి.. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డికి ఫిర్యాదు చేసింది. మంగళవారం మండలంలోని మూలప్పగారిపల్లిలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రాజేశ్వరి మాట్లాడుతూ.. తన భర్త గతనెల 15వ తేదీన ఇంటినుంచి వెళ్లిపోయాడనీ, తిరిగి రాలేదని తెలిపింది. ఎమ్మెల్యే వెంటనే ఇన్‌చార్జి ఎస్ఐ మల్లికార్జునరెడ్డికి ఫిర్యాదు అందించారు. అదృశ్యం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



# రాయలసీమకు సామాజిక న్యాయం చేయాలి

### మానవ హక్కుల వేదిక రాష్ట్ర నేత ఎస్ఎం బాషా



మాట్లాడుతున్న మానవ హక్కుల వేదిక రాష్ట్ర నేత

అనంతపురం టౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రాంతానికి సామాజిక న్యాయం చేయాల్సిన అవసరం ఉందని మానవ హక్కుల వేదిక రాష్ట్ర నేత ఎస్ఎం బాషా పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం రాయలసీమ సమస్యలపై నిర్వహించిన చర్చావేదికకు ఎస్ఎం బాషా హాజరయ్యారు. సెప్టెంబరు 14న ప్రజా ఉద్యమకారుడు పసలూరి ఓబులేసు ఆధ్వర్యంలో రాయలసీమ ప్రజావేదిక ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో స్థానికంగా ప్రజాసంఘాలు, మేధావుల సూచనలు, సలహాలకోసం చర్చావేదిక ఏర్పాటు చేశారు. ఎస్ఎం బాషా మాట్లాడుతూ... రాయలసీమలో తన సామాజిక ఉద్యమ చరిత్రలో మొదటిసారి సామాజిక రాయలసీమ అంశం చర్చకు వచ్చిందన్నారు. ఇది ఎంతో శుభదాయకమన్నారు. ఆయావర్గాలు ప్రజాక్షేత్రంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం తన విధానాల విషయంలో ఒకే రకంగా ఉండాలన్నారు. దేశంలోని అన్ని ఐజీటీల్లో రిజర్వేషన్లు ఉన్నాయనీ, తిరుపతిలో లేకపోవడం వెనుక కుట్ర ఏంటని ప్రశ్నించారు. రాష్ట్ర రాజధాని అమరావతిలోనూ ఉద్యోగ నియామకాల్లో రాయలసీమ అభ్యర్థులకు అన్యాయం వాటిల్లే ప్రమాదముందని వాపోయారు. అమరావతిని ఫ్రీజోన్‌గా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు చంద్రాచర్ల హరి, బీటీపీ గోవింద్, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి వేమన, రాయలసీమ ప్రజాసమితి నాయకుడు శంకర కుళ్లాయప్ప, వైసీపీ ట్రేడ్ యూనియన్ నాయకుడు రాజారత్నం పాల్గొన్నారు.

## అప్పు చెల్లించమన్నందుకే హత్య

### మహిళ హత్యకేసులో నిందితుడి అరెస్టు



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ హేమంత్‌కుమార్

ధర్మవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): అప్పుగా ఇచ్చిన డబ్బును తిరిగి చెల్లించాలని అడిగిందన్న కోపంతో మహిళను హత్య చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ హేమంత్ కుమార్, వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలను వెల్లడించారు. పట్టణంలోని చింతా రమాదేవి వడ్డీ వ్యాపారంతో జీవనం సాగించేది. ఈక్రమంలోనే తన ఇంటి పక్కనే ఉన్న యలమకూరు రాజశేఖర్‌కు రెండేళ్ల కిందట రూ.10వేలు అప్పుగా ఇచ్చింది. కొన్ని రోజుల తర్వాత తన అప్పు తీర్చాలని రమాదేవి తరచూ రాజశేఖర్‌ను అడిగేది. దీంతో ఆయన రూ.5వేలు ఇచ్చి, మిగిలింది తరువాత ఇస్తానని చెప్పాడు. మరికొన్ని రోజుల తర్వాత మిగిలిన మొత్తం ఇవ్వాలని రాజశేఖర్ ఇంటికి వెళ్లి రమాదేవి డిమాండ్ చేశారు. ఇంటి వద్దకు వచ్చి డబ్బులు అడగడాన్ని అవమానంగా భావించిన రాజశేఖర్ గత నెల 29న రమాదేవి ఇంటిలోకి వెళ్లి ఆమెను కొట్టి, అరవకుండా నోరు మూసిపెట్టి కిందకు పడేశాడు. అనంతరం తాడుతో రమాదేవి గొంతును బిగించాడు. పెనుగులాటలో ఆమె ఎలాగోలా తప్పించుకుని ధర్మవరం ఆస్పత్రికి వెళ్లారు. మెరుగైన వైద్యం కోసం బంధువులు అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల నాలుగో తేదీ మృతిచెందారు. మృతురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి, రాజశేఖర్‌ను మంగళవారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసును త్వరగా ఛేదించిన పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

## అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

### రూ.12 లక్షల విలువైన ఆభరణాల స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీసీఎస్, టూటౌన్ సీఐలు

అనంతపురం క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఇళ్లలో చోరీలకు పాల్పడే అంతర్రాష్ట్ర దొంగ విక్కీ అలియాస్ షామీర్(20)ను అనంతపురం సీసీఎస్, టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.12 లక్షల విలువైన ఆభరణాలు, ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అతడి నుంచి మొబైల్ ఫోన్లు కొనుగోలు చేసిన షాపు నిర్వాహకుడిని అరెస్టు చేశారు. దొంగ అరెస్టు వివరాలను మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐలు వలి బాషా, జయపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌చౌదరి, ఎస్ఐ రుషేంద్రబాబు వెల్లడించారు. గుజరాత్ రాష్ట్రం సూరత్‌లోని రాంనగర్‌కు చెందిన సలీం కుమారుడు విక్కీ అలియాస్ షామీర్ ఆరేళ్ల వయసులో తప్పిపోయాడు. అనంతపురం చేరుకోగా కొందరు స్థానికంగా విజయనగర్ కాలనీలోని అనాథ వరణాలయంలో చేర్చారు. అక్కడే ఉంటూ రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో 9వ తరగతి వరకూ చదివాడు. ఈ క్రమంలో చిన్న చిన్న చోరీలు చేశాడు. రాత్రిళ్లు ఇళ్లలో చోరీలు చేస్తూ వచ్చాడు. అలా.. అనంతపురం టూటౌన్ పరిధిలో 2024 నవంబరులో విద్యుత్ నగర్ సర్కిల్‌లో ఓ ఇంట్లో వారం రోజుల్లోనే రెండుసార్లు చోరీ చేసి 2 బంగారు గాజులు అపహరించాడు. వన్‌టౌన్ పరిధిలో జూన్‌లో ద్విచక్రవాహనాన్ని అపహరించాడు. గతనెలలో గోవాలోనూ ఐఫోన్, యాపిల్ లాప్‌టాప్ అపహరించాడు. చోరీలపై కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. అందులో భాగంగా నగర పరిధిలోని ప్రసన్నాయపల్లి రైల్వేగేటు వద్ద నిందితుడిని అరెస్టు చేశారు. అతడి నుంచి సెల్‌ఫోన్లు కొనుగోలు చేసిన ఫరూక్ మొబైల్ షాపు యజమాని ఫరూక్ ఖాన్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.12 లక్షల విలువైన ఆరు తులాల బంగారు గాజులు, 12 సెల్‌ఫోన్లు, రెండు ల్యాప్‌టాప్‌లు, స్కూటీ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు అధికారులు వివరించారు.

# కడప విజయం

### డ్రాగా ముగిసిన చిత్తూరు, అనంత మ్యాచ్

### మల్టీ డే క్రికెట్ టోర్నీ



ధ్రువకుమార్ రెడ్డి



శ్రీకాంత్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మూడోరౌండ్ మల్టీ డే క్రికెట్ పోటీల్లో కడప జట్టు విజయం సాధించగా, చిత్తూరు-అనంతపురం మ్యాచ్ డ్రాగా ముగిసింది. సీనియర్ మల్టీ డే క్రికెట్ మూడో రౌండ్ పోటీలు సోమవారం స్థానిక అనంత క్రీడా గ్రామంలో చివరిరోజు కొనసాగాయి. అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్‌లో చిత్తూరు-అనంతపురం జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు 115.2 ఓవర్లలో 455 పరుగులకు ఆలౌటైంది. ఆతిథ్య అనంతపురం జట్టు ఓవర్‌నైట్ స్కోరు 199/4తో మూడోరోజు మంగళవారం మొదటి ఇన్నింగ్స్ కొనసాగించింది. 90 ఓవర్లలో 377 పరుగులకు ఆలౌటైంది. దత్తారెడ్డి సెంచరీ (164)కితోడు గిరినాథ్‌రెడ్డి (37) పర్వాలేదనిపించాడు. చిత్తూరు బౌలర్ శ్రీకాంత్ 5, ఆశిష్‌రెడ్డి 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 40 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 192 పరుగులు చేసింది. ధరణీ కుమార్ (81), మోనిష్ (64), జ్ఞానేశ్వర్ (41) రాణించారు. చివరి రోజు కావడంతో మ్యాచ్‌ను డ్రాగా నిర్ణయించారు. రాయలసీమ్ క్రికెట్ గ్రౌండ్‌లో నెల్లూరు, కడప జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు 65 ఓవర్లలో 288 పరుగులకు ఆలౌటైంది. అనంతరం మొదటి ఇన్నింగ్ ప్రారంభించిన కడప 69.1 ఓవర్లలో 144 పరుగులకు ఆలౌటైంది. నెల్లూరు రెండో ఇన్నింగ్స్‌లో 47.5 ఓవర్లలో 215 పరుగులకు ఆలౌటైంది. 260 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప 43.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 263 పరుగులు సాధించింది. ధ్రువకుమార్ రెడ్డి సెంచరీ (101), ధనుష్ హాఫ్ సెంచరీ(56)తో జట్టును విజయతీరాలకు చేర్చారు.

## సమ్మెను విజయవంతం చేయండి

### సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

అనంతపురం టౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర కార్మిక సంఘాల పిలుపు నేపథ్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ పిలుపునిచ్చారు. యూనియన్ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని, దీని కారణంగా ఎన్నో త్యాగాలు చేసి, పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు నిర్వీర్యమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులందరూ సమ్మెకు మద్దతుగా బుధవారం జిల్లా వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, ఉపాధ్యక్షుడు మన్నీల రామాంజనేయులు పాల్గొన్నారు.

## సొసైటీలకు త్రిసభ్య కమిటీల నియామకం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదవీకాలం ముగిసిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (సొసైటీ)కు త్రిసభ్య కమిటీలను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ-సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల రోజుల పాటు త్రిసభ్య కమిటీల కాలపరిమితి విధించారు.

| సొసైటీ పేరు | సొసైటీ చైర్మన్ | కమిటీ సభ్యులు |
|---|---|---|
| చియ్యేడు | లక్ష్మీనారాయణ | శ్రీరాములు, సుధాకర్ రెడ్డి |
| మరూరు | గోపాల్ | గంగాధర్, ముసలప్ప |
| శింగనమల | జి. లక్ష్మీనారాయణ | బాలరాజు, లక్ష్మి |
| భైరవానితిప్ప | బోయ ఓబులేసు | శివలింగమూర్తి, ధనుంజయ్య |
| శెట్టూరు | రంగప్పచౌదరి | వెంకటేష్, ఖాదర్‌వలి |
| శ్రీధరఘట్ట | ఎర్రిస్వామి | మోహన్‌రెడ్డి, రుద్రముని |
| ఉద్దేహాళ్ | మల్లికార్జున | లేపాక్షి, మృతుంజయ్య |
| గొడిసెలపల్లి | ఆర్ హనుమంతరెడ్డి | పరమేశ్వరప్ప, బ్రహ్మానందరెడ్డి |
| ఎం హనుమాపురం | బింది హనుమంతరెడ్డి | రామాంజనేయులు, మేఘనాథ్‌రెడ్డి |
| మల్లికేతి | మల్లికార్జున రెడ్డి | గూలెప్ప, భీమక్క |
| కలుగోడు | నీరగంటి తిమ్మప్ప | దేవిప్రసాద్, పెద్దరామప్ప |
| బ్రహ్మసముద్రం | బోయ రామంజనేయులు | మేఘనాథ్, తిప్పయ్య |
| కణేకల్లు | చంద్రశేఖర్ గుప్తా | హనుమప్ప, సువర్ణమ్మ |
| 74-ఉడేగోళం | ఓబయ్య | తిప్పేస్వామి, శశిధర్ |

ఈ సొసైటీలకు ఈనెల 30వ తేదీ వరకు మాత్రమే కాలపరిమితి విధించారు.

● అక్టోబరు 30వరకు బుక్కచెర్ల సొసైటీ చైర్మన్‌గా బ్రహ్మానందరెడ్డి, సభ్యులుగా కిష్టయ్య, సుబ్బమ్మకు కాలపరిమితి విధించారు.

## సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం

అనంతపురంరూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ ప్రవేశాల సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారం ప్రారంభమైంది. అనంతపురం జేఎన్‌టీయూ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ ఎంసెట్ హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేసిన విషయం విదితమే. హెల్ప్‌లైన్ సెంటర్‌కు హాజరైన విద్యార్థుల సర్టిఫికెట్లను జేఎన్‌టీయూ అడ్మిషన్ల డైరెక్టర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో పరిశీలన చేపట్టారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సందేహాలను నివృత్తి చేశారు. అడ్మిషన్ల డైరెక్టర్ మాట్లాడుతూ.. వెబ్ కౌన్సెలింగ్ పూర్తయ్యే వరకు హెల్ప్‌లైన్ సెంటర్ అందుబాటులో ఉంటుందన్నారు. విద్యార్థులు కౌన్సెలింగ్ ప్రక్రియతో పాటు, సర్టిఫికెట్ల అప్‌లోడ్ ఇతరత్రా సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈడబ్ల్యూఎస్ కోటా విద్యార్థులు సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయడంలో పొరబాట్లు చేస్తున్నారన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల పేరున సర్టిఫికెట్లను తీసుకుని అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. స్పెషల్ కేటగిరీ (స్పోర్ట్స్, ఎన్‌సీసీ, సీఏపీ) తదితర వాటి కింద అడ్మిషన్ పొందాలనుకునే విద్యార్థులు విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకే వెళ్లాల్సి ఉంటుందన్నారు. ప్రతి విషయాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు వివరిస్తున్నామన్నారు.

## ఐఈఆర్టీల రెగ్యులర్‌కు అడుగులు

అనంతపురం విద్య, జూలై 8(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష పరిధిలోని ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ విభాగంలో పనిచేస్తున్న ఐఈఆర్టీలను రెగ్యులర్ చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న ఐఈఆర్టీల అర్హతలను పరిశీలించడానికి స్క్రీనింగ్ కమిటీని మంగళవారం రాష్ట్రప్రభుత్వం నియమించింది. ఉమ్మడి అనంత జిల్లాలో 60 మంది ఐఈఆర్టీలు పనిచేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల ఐఈఆర్టీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ముగ్గురిపై హత్య కేసు

గాండ్లపెంట, జూలై8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుట్టకిందపల్లిలో జరిగిన రంగారెడ్డి హత్యలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నాగేంద్ర మంగళవారం తెలిపారు. పోలీసులు తెలిపిన మేరకు సోమవారం గుట్టకిందపల్లిలో రంగారెడ్డిని హత్య చేశారన్నారు. మంగళ వారం సీఐ, ఎన్పీకుంట ఎస్ఐ వలీబాషా సంఘటనా స్థలాన్ని పరిశీలించి, విచారణ చేపట్టారు. మృతుడి వదిన వెంకటరత్నమ్మ ఫిర్యాదు మేరకు... సోమవారం ఫీల్డు అసిస్టెంట్ మనోహర్ ఇంటివద్ద ఉపాధి బిల్లులు పెట్టలేదని రంగారెడ్డి వాగ్వాదం చేశాడు. అదే రోజు రాత్రి రంగారెడ్డితో ఫీల్డ్ అసిస్టెంట్ మనోహర్, దాద్దెప్ప, భార్య స్వాతి ఘర్షణకు దిగారు. ఈక్రమంలో రంగారెడ్డిని తోసేయడంతో సిమెంటు రోడ్డుపై పడి, అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామన్నారు. నిందితులు పరారీలో ఉన్నట్లు చెప్పారు.

## ఆ నలుగురిపై సస్పెన్షన్ రద్దు

### వాణిజ్య పన్నులశాఖ అధికారులకు పోస్టింగ్

అనంతపురం కలెక్టరేట్, జూలై 8(ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల శాఖలో నలుగురు అధికారులపై సస్పెన్షన్‌ను రద్దు చేశారు. వారిలో ముగ్గురు అధికారులకు పోస్టింగ్ సైతం కేటాయించారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం సర్కిల్‌లో పనిచేస్తున్న సీటీఓ క్రిష్ణవేణి, డీసీటీఓలు మధుసూదన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఇంతియాజ్ అహ్మద్‌పై ఆరోపణలు రావడంతో విచారించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 25న ఆ నలుగురిని సస్పెండ్ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఆ నలుగురిపై సస్పెన్షన్ రద్దు చేస్తూ వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ అహ్మద్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. వారికి పోస్టింగ్ సైతం ఇచ్చారు. సీటీఓ క్రిష్ణవేణిని వైఎస్సార్ కడప జాయింట్ కమిషనర్ కార్యాలయంలో సీటీఓగా నియమించారు. డీసీటీఓలు మధుసూదన్ రెడ్డిని కడప జిల్లా రాజంపేట సర్కిల్‌కు, రాజశేఖర్ రెడ్డిని కడప జిల్లా పులివెందులకు, ఇంతియాజ్ అహ్మద్‌ను చిత్తూరు-2 సర్కిల్‌కు కేటాయించారు.

## సౌత్‌జోన్ కాన్ఫరెన్స్‌లో 'అనంత' పీజీల ప్రతిభ



పతకాలు సాధించిన వైద్య విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

అనంతపురం వైద్యం, జూలై 8(ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ కాన్ఫరెన్స్‌లో అనంత వైద్య కళాశాల అనస్థీషియా పీజీ విద్యార్థులు అదరగొట్టారు. ఈనెల 4, 5, 6 తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన దక్షిణ భారత రాష్ట్రాల అనస్థీషియా సదస్సులో కళాశాల పీజీ వైద్య విద్యార్థులు నాలుగు బంగారు పతకాలు సాధించారు. పతకాలను సాధించిన విద్యార్థులను మంగళవారం కళాశాలలో ప్రిన్సిపాల్ షారోన్‌సోనియా, అనస్తీషియా విభాగాధిపతి నవీన్ కుమార్ అభినందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్రీ పేపర్ విభాగంలో డాక్టర్ గౌతమి, క్విజ్‌పోటీల్లో డాక్టర్ పూజ, సుధీర్, రీల్స్ విభాగంలో డాక్టర్ శ్రీధర్ సౌత్ జోన్ అవార్డులు సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ కేఎల్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ నాగేంద్ర, మధుసూదన్, జగదీశాచార్యులు, హరికృష్ణ, గంగాధర్, సోమశేఖర్, షెలియా డైసీ పాల్గొన్నారు.

## గంజాయి కట్టడికి పోలీసుల తనిఖీలు

అనంతపురం క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా, విక్రయాల నియంత్రణ కోసం అనంతపురం పోలీసులు నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు జగదీష్, శాంతిలాల్, ఇతర సిబ్బంది గంజాయి అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. రంగస్వామినగర్, రుద్రంపేట, డీమార్ట్ వెనుక వైపు ప్రాంతంలో పలు చోట్ల తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గంజాయి అమ్మినా, కొనుగోలు చేసినా, అక్రమంగా రవాణా చేసినా చట్టా రీత్యా నేరం అన్నారు. గంజాయి నియంత్రణ కోసం జిల్లా ఎస్పీ, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. గంజాయి రహిత నగరమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామన్నారు. చట్టాలు కఠినంగా ఉన్నాయని, ఎవరూ గంజాయి జోలికి వెళ్లవద్దని ఆయన హెచ్చరించారు.

## న్యూఢిల్లీకి కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూలై 8(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. దేశ రాజధానిలో బుధవారం నిర్వహించే జాతీయ డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్(డీఎంఎఫ్) వర్క్‌షాప్‌లో కలెక్టర్ పాల్గొననున్నారు. కలెక్టర్ గురువారం జిల్లాకు రానున్నారు.

## 11న వాహనాల వేలం

అనంతపురం క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 11న వేలం వేయనున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు పాల్గొని వాహనాలు తీసుకోవచ్చన్నారు. వివరాలకు అనంతపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణను కలవాలని ఆయన సూచించారు.

## యువతిని కాపాడిన పోలీసులు

గుంతకల్లుటౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): చనిపోతున్నానంటూ తండ్రికి మెసేజ్ పెట్టిన యువతిని టూటౌన్ పోలీసులు కాపాడారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాతగుంతకల్లులో నివాసముంటున్న కురువ శివప్ప కుమార్తె డిగ్రీ చదువుకుంది. సోమవారం రాత్రి 7 గంటలకు యువతి ఎవరికీ చెప్పకుండా కోపంతో ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. చనిపోతున్నానంటూ తండ్రికి ఫోన్ ద్వారా మెసేజ్ చేసింది. దీంతో ఆందోళన చెందిన తండ్రి.. టూటౌన్ పోలీసు స్టేషన్‌లో రాత్రి 8.30 గంటలకు ఫిర్యాదు చేశాడు. టూటౌన్ సీఐ మస్తాన్.. సిబ్బందితో యువతి ఫోన్ లోకేషన్ ఆధారంగా వెతకడం మొదలు పెట్టారు. అర్ధరాత్రి గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని, యువతిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. తల్లిదండ్రులను పిలపించి ఆ యువతిని అప్పగించారు.

## న్యూస్ బాక్స్

### రేపు గురుపౌర్ణమి వేడుకలు

తనకల్లు, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని షిర్డీసాయి బాబా ఆలయంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం ప్రత్యేక అభిషేకాలు, సాయి సత్యవ్రతం నిర్వహిస్తామన్నారు. మహా మంగళహారతి అనంతరం తీర్థప్రసాద వినియోగం, అన్నదానం చేపడుతామన్నారు. ఉదయం అల్పాహారం ఉంటుందన్నారు.

### బెట్ట నుంచి వేరుశనగను కాపాడుకోవాలి: ఏఓ

నంబులపూలకుంట, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వేరుశనగ పంటను బెట్ట నుంచి కాపాడుకోవాలని ఏఓ లోకేశ్వర్‌రెడ్డి రైతులకు సూచించారు. ఆయన మంగళవారం మండలంలోని మండ్యెంవారిపల్లి పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వేరుశనగ పంటను పరిశీలించారు. గ్రామంలో 2,500 ఎకరాల్లో వేరుశనగ సాగుచేశారని, మూడువారాలుగా వర్షాలు కురవకపోవడంతో పంట ఎండుదశకు చేరిందన్నారు.

### 'పండ్ల మొక్కలతో రైతుల ఆర్థికాభివృద్ధి'



చింతపల్లి వద్ద పండ్ల మొక్కలు నాటుతున్న అధికారులు, టీడీపీ నాయకులు

ధర్మవరం రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో రైతులు పండ్ల మొక్కలు సాగు చేస్తే ఆర్థిక అభివృద్ధి సాధిస్తారని ఎంపీడీఓ సాయి మనోహర్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ మహేష్ చౌదరి తెలిపారు. మండలంలోని చింతలపల్లి పంచాయతీలో మంగళవారం ఉపాధి హామీ పథకం, డ్వామా సంయుక్త ఆధ్వర్యంలో పండ్లమొక్కలు నాటే కార్యక్రమాన్ని డీఎల్‌డీఓ జనార్దన్ హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఓ సుధాకర్, టీఎలు, రైతులు పాల్గొన్నారు.

● తాడిమర్రి: మండలకేంద్రంలోని రైతు కిష్టప్ప పొలంలో మంగళవారం ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలను పెంచే కార్యక్రమాన్ని ఎంపీడీఓ రంగారావు తదితరులు ప్రారంభించారు. టీడీపీ మండల కన్వీనర్ కూచి రాము, ఈఓఆర్‌డీ విజయ్‌శేఖర్, టీడీపీ నాయకులు హర్షవర్ధన్, పక్కీర్‌రెడ్డి, రంగయ్య, రవీంద్రారెడ్డి, బాస్కర్‌గౌడ్, వినోద్‌కుమార్, బీజేపీ నాయకులు రాము, ఏపీఓ అనిల్, ఈసీ సాయికృష్ణ పాల్గొన్నారు.

● నల్లచెరువు: ఎంపీడీఓ రఘునాథ్ మంగళవారం ఏపీఎం మంజునాథ్‌తో కలిసి మండలంలోని ఓరువాయి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద పండ్లమొక్కల పెంపకాన్ని ప్రారంభించారు. హార్టికల్చర్ సిబ్బంది. టెక్నికల్ అసిస్టెంట్లు రమేష్, హిమకర్, హారూన్, ఫీల్డు అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

● నంబులపూలకుంట: ఉపాధి హామీ పథకం కింద రైతులకు పండ్ల మొక్కలను అందజేస్తున్నట్లు ఎంపీడీఓ పార్థసారధి తెలిపారు. ఆయన మంగళవారం మండలంలోని వంకమద్ది గ్రామంలో రైతుల పొలాల వద్దకు వెళ్లి పండ్ల మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనతోపాటు ఏపీఓ శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నాయకులు నరసింహులు, రవి, నాగేంద్ర, సూర్యశేఖర్, రైతులు పాల్గొన్నారు.

### 'ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి'

కదిరి అర్బన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఫీజు రియింబర్సుమెంట్ బకాయి లను వెంటనే చెల్లించాలంటూ ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. విద్యారంగంలో నెలకున్న సమస్యలపై ఈనెల 11న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద మహాధర్నా చేపడతామన్నారు. నాయకులు మహేంద్ర, నరసింహమూర్తి, ప్రకాష్, జగన్మోహన్, గోపీచంద్, భరత్ తదితరులు ఉన్నారు.

### ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. రాగి వైరు చోరీ

ముదిగుబ్బ, జూలై8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మలకవేముల క్రాస్ ఎనుముల వారిపల్లి గ్రామంలో శ్మశానవాటిక వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం అర్థరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. అందులోని కాపర్ వైర్ చోరీ చేసినట్లు తెలిపారు. స్థానికులు రాత్రి కరెంటు లేదని హెల్పర్‌కు ఫోన్ చేయగా ఆయన ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి చూశాడు. ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి కాపర్ వైర్ దొంగతనం జరిగినట్లు గుర్తించి విద్యుత్ అధికారులకు సమాచారం అందించారని తెలిపారు. అర్ధరాత్రి నుంచి ఎస్సీ కాలనీకి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

### ఇంట్లో చోరీ

కదిరి, జూలై 8(ఆంధ్రజ్యోతి): స్థానిక నారాయణరెడ్డి వీధిలోని నరాసారెడ్డి ఇంట్లో సోమవారం తెల్లవారుజామున చోరీ జరగడంతో మంగళవారం క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్ పరిశీలించాయి. యజమానిలేని సమయంలో ఇంట్లోకి చొరబడి 17 తులాల బంగారు ఆభరణాలు, వెండి ఆభరణాలు, కొంత నగదు అపహరించుకెళ్లారు. సీసీటీవీ ఫుటేజీలో చోరీ వ్యవహారం రికార్డయింది. ఇతర రాష్ట్రాల వారుగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. దీంతో క్యూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

### బొలెరో వాహనం బోల్తా



నేల పాలైన అరటి కాయలు

నల్లచెరువు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగన్న గారిపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం బొలేరో వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. కడప జిల్లా పులివెందల నుంచి అరటికాయల లోడుతో బొలేరో వాహనం మదనపల్లి వైపు వెళ్తోంది. రాగాన్నగారిపల్లి సమీపంలో అదుపు తప్పి బోల్తాపడింది. వాహనంలో ఉన్న డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. అరటికాయలు కొద్దిమేర దెబ్బతిన్నట్లు స్థానికులు తెలిపారు.

### గుండెపోటుతో టీడీపీ కార్యకర్త మృతి

నల్లచెరువు, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలమర్లవాండ్లపల్లి పంచాయతీలోని గురుజోనవాండ్లపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త విజయ్‌కుమార్(55) గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. ఉన్నఫలంగా గుండెపోటు రావడంతో మృతిచెందాడని కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారైలు, కుమారుడున్నట్లు తెలిపారు. పలువురు నాయకులు మృతదేహానికి పూమాలలు వేసి, నివాళ్లు అర్పించారు.

### విద్యార్థులకు క్రీడాపరికరాల అందజేత



విద్యార్థులకు క్రీడాపరికరాలు అందజేస్తున్న మాజీ మంత్రి పల్లె

కొత్తచెరువు, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి క్రీడాపరికరాలను మంగళవారం అందజేశారు. రూ.6వేలు విలువ చేసే సాఫ్ట్‌బాల్, వాలీబాల్, షటిల్, బాల్ బ్యాడ్మింటన్, క్రికెట్ కిట్లను ఆయన చేతులమీదుగా అందజేసినట్లు పీడీలు వెంకటేశ్, నారాయణమ్మ తెలిపారు. వాటిని వినియోగించుకుని చదువుతో పాటు క్రీడలలో రాణించాలని మాజీ మంత్రి పల్లె విద్యార్థులకు సూచించారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

# తాగునీటికి ఇక్కట్లు

● తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్న అధికారులు



ఎస్సీ కాలనీలో మహిళల నిరసన (ఫైల్)

ముదిగుబ్బ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నిత్యం విద్యుత్ అంతరాయం వల్ల తాగునీటి మోటార్లు సరిగా పనిచేయక సత్యసాయి, ఆర్‌డబ్ల్యూఎస్ నీటిపై ఆధారపడిన గ్రామాల ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ముదిగుబ్బ మండలంలోని చిన్నకోట్ల గ్రామ సమీపంలో ఉన్న పార్నపల్లి జలాశయం నుంచి ముదిగుబ్బ, తలుపుల, కదిరి, నల్ల మాడ, గాండ్ల పెంట, తనకల్లు, ఓబులదేవరచెరువు, మండలాలకు సత్య సాయి పథకం ద్వారా నీరు సరఫరా అవుతోంది. నెల రోజుల నుంచి తరచూ విద్యుత్ సమస్య తలెత్తుతుండడంతో అక్కడి సత్యసాయి పంప్ హౌస్‌లోని మోటార్లు నిలిచిపోతున్నాయి. విద్యుత్ సక్రమంగా లేకపోవడంతో గత నెలలో రెండురోజుల పాటు సత్యసాయి నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో దాదాపు 250 గ్రామాల ప్రజలకు సకాలంలో నీటి సరఫరా నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గ్రామాల్లో ప్రజలు పంచాయతీ బోర్లపై ఆధారపడాల్సి వస్తోంది. ప్రైవేటు ట్యాంకర్లు, ఫిల్టర్ వాటర్ వ్యాన్‌ల ద్వారా నీటిని కొనుగోలు చేసి దాహార్తి తదితర నీటి అవసరాలను తీర్చుకుంటున్నారు.

#### శాశ్వత పరిష్కారం ఎప్పుడో..?

ముదిగుబ్బ మండలంలోని చిన్నకోట్ల ఫీడర్ పరిధిలో నిత్యం విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. ప్రధానంగా కంపచెట్లలో లాగిన విద్యుత్ తీగలకు గాలి వీచినప్పుడు కంప చెట్లు తగిలి విద్యుత్ ట్రిప్ కావడంతో ఇన్సులేటర్లు కాలిపోతున్నాయి. విద్యుత్ అధికారులు ఎక్స్‌కవేటర్ సాయంతో కంపచెట్లను తొలగించి, తాత్కాలిక మరమ్మతులతో సరిపె ట్టారు. అయితే శాశ్వత పరిష్కారం ఎప్పుడు చేస్తారని ప్రజలు ప్రశ్నిస్తు న్నారు. ఏదైనా విద్యుత్ అంతరాయం జరిగితే మరమ్మతులు చేయ డానికి కొన్ని గంటల సమయం పడుతుంది. ఆ సమయంలో విద్యుత్ మోటార్లు ఆడకపోవడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయి ఆయా గ్రామాల్లో సమస్య అధికమవుతోంది. దీంతో ముదిగుబ్బతో పాటు కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లోని మండలాలకు పూర్తి స్థాయిలో నీరు అందకపోవడంతో తాగునీటి కష్టాలు ఎదురవుతున్నాయి. ఇదిలా ఉండగా ముదిగుబ్బ ఎస్సీ కాలనీకి రెండుమూడు రోజులకొకసారి నీటిని వదలుతున్నారని, అవి కూడా సక్రమంగా సరఫరా కావడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. కాలనీలో ఎగువన ఉన్న వీధులకు నీరు అందక ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. దీంతో ఖాళీ బిందెలతో గనెల 20న నిరసన కూడా తెలిపారు. కదిరి డివిజనల్ విద్యుత్ అధికారులు స్పందించి తరచూ విద్యుత్ అంతరా యం లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

**తాగునీటి సమస్య పరిష్కరించాలి**



ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య అధికంగా ఉంది. దానిని పరిష్కరించాలి. కాలనీలో రెండు మూడు రోజులకు ఒకసారి నీటిని వదులుతున్నారు. అవి కూడా సక్రమంగా సరఫరా కాకపోవడంతో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

- నరసింహులు, ఎస్సీ కాలనీ, ముదిగుబ్బ

**చాలా ఇబ్బందులు పడుతున్నాం**



రెండు, మూడు రోజులకు ఒకసారి ఎస్సీ కాలనీకి నీరు వదులుతున్నారు. దీంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడున్నాం. పూర్తి స్థాయిలో నీటిని సరఫరా చేసి మా ఇబ్బందులు తొలగించేలా చర్యలు చేపట్టాలి

-రామాంజినమ్మ, ఎస్సీ కాలనీ, ముదిగుబ్బ

**సమస్యను పరిష్కరిస్తాం**

చిన్నకోట్ల విద్యుత్ ఫీడర్ పరిధిలో కంపచెట్లను తొలగించి, మరమ్మతులు చేయించాం. విద్యుత్ సకాలంలో సరఫరా అవుతోంది. దీనికి తోడు బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నాం. సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుంది.

-శివతేజ, ఏఈఈ, ముదిగుబ్బ

## రైతు సంక్షేమమే సీఎం ధ్యేయం

● ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



మసకవంకపల్లిలో సుపరిపాలనకు తొలిఅడుగులో పాల్గొన్న ఎమ్మెల్యే

నల్లమాడ, జూలై 8(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ధ్యేయమని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆమె మంగళవారం మండలంలోని మసకవంకపల్లి, మూలప్పగారిపల్లిలో పర్యటించారు. ఆమెకు ప్రతి ఇంటివద్ద హారతులతో స్వాగతం పలి కారు. ఆమెతో పాటు టీడీపీ నాయకులు సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ మైలే శివశంకర్, మాజీ కన్వీనర్ కేశవరెడ్డి, బుట్టి నాగభూషణ నాయుడు, మహబూబ్‌బాషా, గంగన్న, ఎల్ఐసి నర సింహులు, విష్ణు, గడ్డం రమణారెడ్డి, సుబ్బరాయుడు, జయప్ప, పెద్ద ప్పనాయుడు, వెంకట రమణనాయుడు, గంగులప్ప నాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే మూలప్పగారిపల్లిలో మహిళా రైతు సరస్వతి పొలంలో మంగళవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా మామిడి మొక్కలు నాటారు. పలువురు రైతులు మాట్లాడుతూ పది ఎకరాల వరకు అనుమ తిస్తే మరింత మంది పండ్ల మొక్కలు సాగుచేసుకోవచ్చనగా, ప్రభుత్వంతో చర్చిస్తామని ఆమె తెలిపారు. ఆమెతోపాటు ఎంపీడీఓ ఆజాద్, ఏపీఓ రఘునాథ్ రెడ్డి, వీఆర్‌ఓ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

### వైద్యశాలను పరిశీలించిన ఎమ్మెల్యే

ఆంధ్రజ్యోతికి స్పందన

ఓబుళదేవరచెరువు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాల శిథిలావస్థకు చేరుకోవడంతో మంగళావారం 'వైద్యశాలకు వెళ్లాలంటే భయం భయం' అనే వార్త ఆంధ్రజ్యోతి దినప త్రికలో ప్రచురి తమైన విషయంవిదితమే. దీనికి స్పందించిన ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి వైద్యశాలలోని గదులను పరిశీలించారు. నూతన భవన నిర్మాణం కోసం వైద్యశాఖ మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

### 'చేనేత పరిశ్రమను కాపాడాలి'

ధర్మవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు నేతన్న నేస్తం పథకాన్ని వెంటనే అమలు చేయాలని, కనుమరుగవుతున్న పరిశ్రమను కాపాడాలని చేనేత కార్మిక సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నంపల్లి శ్రీనివాసులు మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం కొత్తచెరువుకు వస్తున్న సందర్భంగా... జిల్లాలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అలాగే ఎన్నికలకు ముందు చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను గుర్తుకు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా ఒక్క హామీ నెరవేరలేదన్నారు.

### ఐఐటీ రూర్కీలో శిక్షణ పొందిన అధ్యాపకులు



సర్టిఫికెట్లు అందుకుంటున్న అధ్యాపకులు గోపాల్‌నాయక్, పావని

ధర్మవరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్న డాక్టర్ గోపాల్‌నాయక్, పావని యూజీసీ-మాలవ్య మిషన్ బోధన శిక్షణ పొందినట్టు కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి తెలిపారు. కళాశాలకు చెందిన అధ్యాపకులు గోపాల్‌నాయక్, పావని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉత్తరాఖండ్ లోని ఐఐటీ రూర్కీలో జరిగిన ఐదు రోజుల కార్యక్రమానికి హాజరై శిక్షణ పొందారన్నారు. జూన్ 28 నుంచి ఈ నెల 2వతేదీ వరకు 'భవిష్యత్ నాయకత్వాన్ని పెంపొందించడం' అనే అంశంపై జరిగిన శిక్షణకు రాష్ట్రం నుంచి ఈ ఇద్దరు అధ్యాపకులు మాత్రమే ఎంపికై శిక్షణ పూర్తి చేసుకుని రావడం కళాశాలకు గర్వకారణమని ప్రిన్సిపాల్ తెలిపారు. శిక్షణ పొందిన అధ్యాపకులను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

## హామీలన్నీ అమలు చేస్తున్నాం

● ఎమ్మెల్యే కందికుంట



కట్లతండాలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి అర్బన్/గాండ్లపెంట, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ లన్నీ తమ ప్రభుత్వం అమలు చేస్తోం దని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్ర సాద్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం మండలంలోని కొండమ నాయునిపాళ్యం, కట్లతండా, ముత్యాలచెరువు గ్రామాల్లో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమా న్ని నిర్వహించారు. అనంతరం కట్లతం డాలో ఉపాధి పథకం కింద మామిడి మొక్కలను నాటి పండ్ల మొక్కల పెంపకం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీడీ రమేష్, డీఎల్‌డీఓ వెంకటరత్నం, ఎంపీడీఓ పోలప్ప, పంచాయతీ కార్యద ర్శులు, సిబ్బంది, టీడీపీ మండల కన్వీనర్ చెన్నకేశవులు, కుపేంద్రరెడ్డి, గంగులప్ప, ఉరాతి చంద్ర, రామచంద్ర, హరి, జయచంద్ర, నల్లబాపినేని భార్గవ్, భాస్కర్, తిరుపాల్‌యాదవ్, సుధాకర్, రాజశేఖర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే గాండ్లపెంట మండలంలోని గొడ్డివెలగల పంచాయతీ వంకలోపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త సతీష్ తల్లి మృతదేహాన్ని సందర్శించి, నివాళులు అర్పించారు.

### ప్రసన్నకుమార్‌రెడ్డి.. మహిళలకు క్షమాపణ చెప్పాలి

● కదిరి: మాజీఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని, మహిళలందరికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే కందికుంట డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... మహిళలను కించపరిచే, వారంటే గౌరవం లేనిపార్టీ వైసీపీ అన్నారు. ఒకేరకరమైన ఆలోచనలున్న వారంతా ఒకే దగ్గరుంటారని చెప్పడానికి ఇది నిదర్శన మన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ పాల్గొన్నారు.

## పేదల ఇళ్ల స్థలాలతో

# రియల్ ఎస్టేట్ వ్యాపారమా?

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్



పథకాలు అందుతున్నాయా అని వృద్ధురాలిని అడుగుతున్న పరిటాలశ్రీరామ్

ధర్మవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఇళ్లులేని నిరుపేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలతో కొందరు వ్యక్తులు రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన మంగళవారం సాయంత్రం పట్టణంలోని 21, 22 వార్డులలో పర్యటించారు. ఎల్పీ సర్కిల్‌లోని అన్నక్యాంటీన్ వద్ద నుంచి సిద్దయ్య గుట్ట, సాయినగర్‌లో ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి అడిగితెలుసుకున్నారు. ప్రజలు ప్రభుత్వ పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు. అదే సమయంలో డ్రైనేజీ, రోడ్లు, ఇళ్ల స్థలాల గురించి ఆయనకు వినతులు వచ్చాయి. గత ప్రభుత్వంలో చాలా మంది అనర్హు లకు ఇళ్ల స్థలాలు దక్కాయని కొందరు ఫిర్యాదు చేశారు. దీనిని వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటిస్థలంతో పాటు ఇళ్లు నిర్మించే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీ సీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, పట్టణ ప్రధాన కార్యదర్శి పురుషోత్తంగౌడ్, టీడీపీ నాయకులు సంధా రాఘవ, భీమనేని ప్రసాద్‌నాయుడు, నాగూర్ హుస్సేన్, కొత్తపేట ఆది, రాళ్లపల్లి షరీఫ్, మాధవరెడ్డి, బీరే శీన, జింకా పురుషోత్తం, చిన్నూరు లోకేశ్, పఠాన్ బాబూఖాన్ పాల్గొన్నారు.

# 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి: ఎస్టీయూ



ఎస్టీయూ సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఉపాధ్యాయులు

నంబులపూలకుంట, జూలై 8(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథకోన్నత, ఉన్నతపాఠశాల్లో మంగళవారం ఎస్టీయూ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ముందు నాయకులు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏలు, ఐఆర్ ప్రకటించాలని డిమాండ్‌చేశారు. 12వ పీఆర్‌సీ కమిషన్ రాజీనామా చేయడంవలన వెంటనే కమిషన్‌ను నియమించి నిర్ణీత కాలపరిమితిలోగా నివేదిక తెప్పించుకోవాలన్నారు. త్వరగా 12వ పీఆర్‌సీని అమలుచేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా డీఏలు, పీఆర్‌సీని ప్రకటించి ఉద్యోగులకు ఉపశమనం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు వెంకటేశ్వర్లు, రామాంజులు, వీర మహేశ్వర, మురళి, శంకర్‌రెడ్డి, శీనానాయక్, రాణాప్రతాప్, అజారుద్దీన్, జయకుమార్‌నాయక్, సీతారత్నం తదితరులు పాల్గొన్నారు.

## శాకంబరిగా వాసవీమాత



కదిరి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కన్యాకాపరమేశ్వరీ ఆలయంలో ఆషాఢమాసం సందర్భంగా వాసవీ మాతను వివిధ కూరగాయాలతో శాకంబరిగా అలకరించారు. ఉదయం అమ్మవారికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## గ్రామ దేవతలకు బోనాలు



బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

ధర్మవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): వర్షాలు బాగా కురిసి, పంటలు పండి ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని కోరుతూ లోనికోట ప్రజలు గ్రామదేవతలైన దుర్గమ్మ, పెద్దమకు జ్యోతులు, బోనాలు సమర్పించారు. ఆషాఢ మాస మంగళవారం పురస్కరించుకుని ప్రతి ఏడాదిలాగే మహిళలు బోనాలను నెత్తిన ఎత్తుకుని ఊరేగింపుగా దుర్గమ్మ, పెద్దమ్మ ఆలయాలకు వెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గవ్వల నారాయణస్వామి, గవ్వల బాబు, అంజి, సూరి లోనికోట వాసులు పాల్గొన్నారు.

## పీర్ల భేటీ



భేటీ తీసుకుంటున్న పీర్లు

బత్తలపల్లి జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని సత్రం వద్ద మంగళవారం పలు గ్రామాల పీర్ల భేటీ కార్యక్రమం జరిగింది. మండలంలోని లింగారెడ్డిపల్లి, మాల్యవంతం, అనంతసాగరం, వెంకటగారిపల్లి, నారసింహపల్లి గ్రామాల పీర్లు సత్రం వద్ద భేటీ అయ్యాయి. కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. భేటీ అనంతరం పీర్లు తిరిగి అయా గ్రామాలకు తరలివెళ్లాయి. మండలంలోని గంటా పురం, వేల్పుమడుగు, పోట్లమర్రి, ముస్టూరు, రాఘవంపల్లి కొలువు దీరిన పీర్లు జలధికి తరలివెళ్లాయి. ఈ సందర్భంగా యువకులు, వృద్ధులు మహిళలు అన్న తేడా లేకుండా నృత్యాలు చేశారు.

## జలధికి తరలిన పీర్లు



బడన్నపల్లిలో జలధి వెళ్తున్న పీర్లు

ధర్మవరం రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బడన్నపల్లి, మల్కాపురం గ్రామాల్లో మంగళవారం పీర్లు జలధికి తరలి వెళ్లాయి. కొలువుదీరిన పీర్లకు పెద్దఎత్తున గ్రామస్థులు చక్కెర చదివింపులు చేశారు. గుండం చుట్టూ యువకులు అలావ్ తొక్కారు. ఆయా గ్రామాల్లో పీర్లను ఊరేగించి జలధికి తరలించారు.

● కొత్తచెరువు: మండల కేంద్రంలోని కొండకింద, ఇసుక వంక, బోయవీధిలో కొలువుదీర్చిన పీర్లను అలంకరించి ప్రార్థనలు చేశారు. అగ్నిగుండంలో ప్రవేశించి, జలధికి తరలించారు. భక్తులు అధికసంఖ్యలో చక్కెర చదివింపులు చేశారు.



కొత్తచెరువులో జలధికి తరలి వెళ్తున్న పీర్లు

## ఘనంగా వైఎస్సార్ జయంతి

గాండ్లపెంట, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో మంగళవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను వైసీపీ మండల కన్వీనర్ రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించి, కేక్ కట్ చేశారు.

### వైసీపీలో వర్గపోరు

నల్లచెరువు, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలో వైసీపీలో వర్గపోరు రోజురోజుకు పెరుగుతున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. మంగళవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి నియోజకవర్గ నాయకులు హాజరైనా... స్థానిక సర్పంచ్, ఎంపీటీసీకి, పార్టీ సీనియర్ నాయకునికి ఆహ్వానం అందకపోవడంపై ప్రజలు చర్చించుకుంటున్నారు. అలాగే జడ్పీటీసీ, ఎంపీపీ, మరికొంతమంది సర్పంచ్‌లు సైతం హాజరుకాకపోవడం చర్చనీయాంశమైంది. కార్యక్రమానికి హాజరు కానివారిని ప్రశ్నించగా, ఒక వర్గం వారిని మాత్రమే ప్రోత్స హిస్తున్నారని, మిగిలినవారిని పిలవడంలేదన్నారు. అలాగే ఓ సామాజిక వర్గం వారికే పదవులు అప్పగిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

### రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కదిరి విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న చైర్మన్ తదితరులు

కదిరి అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఫుట్‌బాల్ పోటీలకు స్థానిక బ్లూమూన్ విద్యా సంస్థల విద్యార్థి తనీష్ ఎంపికైనట్లు ఆ విద్యా సంస్థల చైర్మన్ శివ శంకర్ తెలిపారు. రాజమండ్రిలో ఈనెల 12, 13 తేదీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు తమ విద్యార్థి పాల్గొంటారన్నారు. విద్యార్థి ఎంపికపట్ల ప్రధానోపాధ్యాయులు సురేంద్రరెడ్డి, పీఈటీ రామాంజులరెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

## గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



లేపాక్షి, జూలై 8(ఆంధ్రజ్యోతి): శిరివరం గ్రామంలో వెలసిన గ్రామదేవతలు మారెమ్మ, సత్యమ్మకు గ్రామస్థులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని కోరుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. అనంతరం ఆలయ ఆవరణంలో అన్నదానం నిర్వహించారు.

### తుమ్మల మారెమ్మకు..



గుడిబండ, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుడిబండలో వెలసిన తుమ్మల మారెమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమం నిర్వహించారు.

## సమ్మెను జయప్రదం చేయండి: ఏఐటీయూసీ



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకుడు

సోమందేపల్లి, జూలై 8(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సమ్మెను బుధవారం నిర్వహించడం జరుగుతోందని, కార్మికులు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకుడు రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 44 లేబర్ చట్టాలను రద్దుచేసి నాలుగు బార్ కోడ్‌లను తెచ్చిందన్నారు. వీటివల్ల కార్మికులు ఇబ్బందులుకు గురవుతున్నారన్నారు. కార్మికుల వేతనాన్ని రూ.26వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి రాజగోపాల్, బాలస్వామి, చీల నారాయణస్వామి, బాబ్జాన్, ఖాసీంఖాన్ పాల్గొన్నారు.

## పీ-4 సర్వే రిపోర్టుపై సమావేశం



సర్వేపై అధికారులతో మాట్లాడుతున్న నాయకులు

సోమందేపల్లి, జూలై 8(ఆంధ్రజ్యోతి): బంగారు కుటుంబాల ఎంపికపై సచివాలయ ఉద్యోగుల ద్వారా చేపట్టిన సర్వేరిపోర్టుపై మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో టీడీపీ నాయకులు భేటీ అయ్యారు. 16 పంచాయతీల్లో 14 సచివాలయాల ద్వారా పీ-4 సర్వేను నిర్వహించి నివేదిక పంపారు. ఈ నేపథ్యంలో సర్వే రిపోర్ట్‌లో తప్పిదాలు సరిదిద్దడానికి ఎంపీడీఓ వెంకటలక్ష్మీ ఆధ్వర్యంలో నాయకులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా 921 బంగారు కుటుంబాలను ఎంపిక చేయగా 2441మంది అర్హులుగా జాబితాలో పేర్కొన్నారు. అయితే అనేక మంది అనర్హులు ఉన్నట్లు నాయకులు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీలవారీగా జరిగిన విచారణలో తప్పిదాలు గుర్తించిన నాయకులు వాటిపై పునర్విచారణ జరిపి అర్హులను గుర్తించాలన్నారు. సీఎం ఆదేశాల మేరకు ఆగస్టులోపు 15 లక్షల బంగారు కుటుంబాలు ఏర్పాటు చేయడం లక్ష్యంకాగా ఎంపిక చేసిన వారికి ప్రైవేట్, ఎన్ఆర్ఐ పరిశ్రమల వ్యవస్థాపకుల భాగస్వామ్యంతో చేయూతనందించి వారికి తోడ్పాటునందించనున్నారు.

## అగ్నిగుండంలో పడి తీవ్రగాయాలు

గోరంట్ల, జూలై8 (ఆంధ్రజ్యోతి): పీర్లచావిడి వద్ద అల్లావు తొక్కుతూ సెల్ఫీ తీసుకునేయత్నంలో యువకుడు అగ్నిగుండంలో పడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని పాలసముద్రం బీసీ కాలనీకి చెందిన ఆనంద్‌కుమార్ సోమవారం రాత్రి అల్లావు తొక్కుతూ సెల్ఫీతీసుకునే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు అగ్నిగుండలో పడ్డాడు. స్థానికులు ప్రైవేటు వాహనంలో అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

## 11న గోరంట్ల మండల మీట్

గోరంట్ల, జూలై8 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 11న మండల సర్వసభ్యసమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30గంటలకు జరిగే సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులు తప్పకుండా హాజరుకావాలని కోరారు. ప్రభుత్వ అధికారులు ప్రగతి నివేదికలతో రావాలన్నారు.

### కార్మికుడికి గాయాలు

పెనుకొండ టౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): కియా అనుబంధ పరిశ్రమ యునైటెడ్‌లో పనిచేస్తున్న కార్మికుడు సుధాకర్ చేతికి గాయాలయ్యాయి. మంగళవారం విధులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు మెటీరియల్ తగిలి అరచేతిలో దూరింది. ఈ క్రమంలో సిబ్బంది పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

## హత్య కేసులో నిందితుడి అరెస్టు

గోరంట్ల, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ముత్తరాయునితండాకు చెందిన హత్యకేసు నిందితుడు భాస్కర్‌నాయక్‌ను మంగళవారం అరెస్టుచేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. ఈనెల 4న ముత్తరాయునితండాకు చెందిన లోకేష్‌నాయక్, భాస్కర్‌నాయక్ గొడవపడగా, భాస్కర్‌నాయక్ కట్టెతో లోకేష్‌నాయక్‌ను తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందిన విషయం తెలిసిందే. భాస్కర్‌నాయక్‌పై హత్యకేసు నమోదుకాగా, మండలంలోని బూదిలి గ్రామం వద్ద భాస్కర్‌నాయక్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

## దాడిలో ఇరువురికి గాయాలు

గోరంట్ల, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని మల్లాపల్లిలో జలధి వేడుకలు మంగళవారం జరుగుతుండగా పాతకక్షల నేపథ్యంలో జరిగిన దాడిలో అన్నదమ్ములు నరసింహమూర్తి, రాజు గాయపడ్డారు. ఏడాదిక్రితం హత్యకు గురైన మల్లాపల్లి వలంటీర్ అనిల్, నరసింహమూర్తి స్నేహితులు. వీరిరువు ద్విచక్రవాహనంలో మద్యం సేవించడానికి కర్ణాటక సరిహద్దు ప్రాంతానికి వెళ్లారు. ఆ సమయంలో కొత్తచెరువుకు చెందిన వ్యక్తులతో అనిల్ గొడవపడగా వారు కొట్టిన గాయాలకు అనిల్ అక్కడిక్కడే మతిచెందడంతో కేసు నమోదైయింది. నరసింహమూర్తితో అనిల్‌ను మద్యం తాగడానికి తీసుకెళ్లి హత్య చేయించారని అనిల్ కుటుంబ సభ్యులు కక్షపెంచుకున్నట్లు బాధితులు తెలిపారు. దీంతో అనిల్ తండ్రి కోడిపల్లి నరసింహులు, కుట్టెప్ప, ఆదర్శ, కళావతి తదితరులు జలధి వేడుకల్లో అలావు తొక్కుతున్న తమపై దాడిచేశారన్నారు. నరసింహమూర్తి తలపై కత్తి గాయాలుకాగా, రాజు ఎడమచేయికి గాయమైంది. సీఐ శేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# 16న నగర పంచాయతీ చైర్మన్ ఎంపిక




మడకశిర టౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ కొత్త చైర్మన్ ఎంపిక ఈనెల 16న జరగనుంది. నగర పంచాయతీ చైర్మన్ లక్ష్మీ నరసమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డిలపై మే 15న అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టారు. 20మంది కౌన్సిలర్లుకు 15మంది హాజరై అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలిపారు దీంతో వారు ఇద్దరు పదువులు కోల్పోయినట్లు రాష్ట్ర ప్రిన్సిపాల్ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ జూన్ 16న ఉత్తర్వులు వెల్లడించారు. దీంతో మడకశిర నగర పంచాయతీకి ఈనెల 16న కొత్త చైర్మన్ ఎంపిక జరగనుంది. అందుకోసం మంగళవారం ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ఇస్తూ ఉత్తర్వులు వెలువరించింది. నోటిఫికేషన్ ఈనెల12న విడుదల కానున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ జగన్నాథ్ తెలిపారు. 16న తేదీన ఉదయం 11 గంటలకు నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్, వైస్‌చైర్మన్ ఎంపికకు సంబంధించి ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. మడకశిర నగర పంచాయతీ పీఠం టీడీపీ వశం కానుంది. పంచాయతీ చైర్మన్‌గా 15వ వార్డు కౌన్సిలర్ నరసింహరాజు ఎంపిక లాంఛనమేనని ఆ వర్గాలు అంటున్నాయి. గత కొన్ని రోజుల నుంచి మడకశిర నగర పంచాయితీ చైర్మన్ ఎంపిక ప్రక్రియను ఎప్పుడు నిర్వహిస్తారన్న ఎదురుచూపులకు దీంతో తెరపడినట్లు అయింది.

## మహనీయుడు.. పూలే

### ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): భారతదేశంలోని అన్ని వర్గాల వారికి చదువు అందించిన మహనీయుడు మహాత్మ జ్యోతిబా పూలే అని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. మంగళవారం రాత్రి పట్టణంలోని జ్యోతిబాపూలే జూనియర్ కళాశాలలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమలతిప్పేస్వామితో కలిసి విద్యార్థులకు ఎంజేపీ సొసైటీ అందించిన ట్రాంకు పెట్టెలు, పుస్తకాలు, పెన్సిల్, పెన్ తదితర సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశంలో తొలిఉద్యమ స్ఫూర్తి ప్రదాత అని, జ్యోతిబాపూలే చరిత్రను ప్రతి విద్యార్థి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్య అనేది కేవలం ఒక్క వర్గానికి మాత్రమే కాదని, అన్ని వర్గాలకు అందాలని కోరుకొన్న గొప్ప వ్యక్తి అని అన్నారు. భావితరాలు సైతం మహనీయుల చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వం అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బషీరున్నిసా. వైస్ ప్రిన్సిపాల్ జి.కర్థానాయక్, అధ్యాపకులు ఈ బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో జలధి



జలధికి తరలుతున్న పీర్లు

సోమందేపల్లి, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాతూరులో మంగళవారం పీర్ల జలధిని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పీర్లకు చక్కెర చదివించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ప్రార్థనలు నిర్వహించారు. పీర్లను వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా పీర్ల అగ్నిగుండ ప్రవేశాన్ని తిలకించడానికి భక్తులు పెద్దఎత్తున వచ్చారు. అనంతరం జలధి నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ కన్వీనర్ సూరి, యుడి కుల్లాయప్ప, టీసీ హరి, వడ్డెశీన, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర టౌన్, జూలై8(ఆంధ్రజ్యోతి): మొహర్రం సందర్భంగా మంగళవారం తెల్లవారుజామున అగ్నిగుండ మహోత్సవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మొక్కుబడులు తీర్చుకొన్నారు. సాయంత్రం వరకు చదివింపులు చేపట్టారు. అనంతరం పీర్ల ఊరేగింపు చేపట్టి జలధి నిర్వహించారు.



గుట్టూరులో పీర్ల ఊరేగింపు

పెనుకొండ రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మొహర్రం సందర్భంగా గుట్టూరు మునిమడుగు వెంకటగిరిపాళ్యం, అమ్మవారిపల్లి తదితర గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో పీర్లను ఊరేగించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటుచేసిన పీర్లను ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళవారం అగ్నిగుండం ముందు ప్రవేశపెట్టారు. అనంతరం జలధికి తరలించారు.

## పంటలకు బీమా చేయించుకోండి: ఏఓ



రొద్దంలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

సోమందేపల్లి, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు ప్రధానమంత్రి ఫసల్‌బీమా పథకం ద్వారా ప్రతిరైతు బీమా చేయించుకోవాలని ఏఓ విజయభారతి సూచించారు. మంగళవారం మండలంలోని జూలకుంట, పందిపర్తి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. మొక్కజొన్న సాగులో కత్తెర పురుగు నివారణకు ఎమామెక్టిన్ 100ఎంఎల్ ఎకరాకు పిచికారి చేసుకోవాలన్నారు. అనంతరం కంది, వేరుశనగ పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ అలైఖ్య, టెక్నికల్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం, బీఏఏ కులశేఖర్, వీఎస్ఏ రోజ, టీఏ జయరాం, ఇన్సూరెన్స్ ఉద్యోగి నరేంద్ర, అంజి, నాగరాజు, కిష్టప్ప, రైతులు పాల్గొన్నారు. అదేవిధంగా హిందూపురం, రొద్దం, పెనుకొండ పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ అధికారులు నిర్వహించారు.

## శాకంబరిగా వాసవీమాత



కదిరి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కన్యాకాపరమేశ్వరీ ఆలయంలో ఆషాఢమాసం సందర్భంగా వాసవీ మాతను వివిధ కూరగాయాలతో శాకంబరిగా అలకరించారు. ఉదయం అమ్మవారికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## ముగిసిన ఏకాదశి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామివారు

గోరంట్ల, జూలై8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంతపల్లి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద తొలి ఏకాదశి పర్వదినవేడుకలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు ఆలయం చుట్టు రైతులు ఎడ్లబండ్లతో ప్రదక్షిణలు చేయించారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం ఉట్లమాను పరుష నిర్వహించారు.

### వేడుకల్లో అపశ్రుతి

ఎండ్లబండ్లను పరిగెత్తిస్తుండగా ఓ బండి అదుపు తప్పి జనంపైకి దూసుకెళ్లింది. గంగాదేవిపల్లికి చెందిన ఆదినారాయణ బండికింద పడి గాయపడ్డారు. ఎడమచేయి కుడికాలు విరగడంతో గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్ ఉషా చికిత్సలు చేసి మెరుగైన చికిత్స కోసం హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

## హుండీ ఆదాయం రూ.21 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

మడకశిర రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): భక్తరహళ్లి నరంసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి హుండీలెక్కింపు జరిగినట్లు దేవాదాయశాఖ ఈఓ నరసింహరాజు మంగళవారం తెలిపారు. రెండు దేవాలయాల నుంచి రూ.21 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. హుండీ లెక్కింపు దేవదాయశాఖ కర్నూలు డీసీ రాజేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లేడగుంట ఆంజనేయస్వామి హుండీ నుంచి రూ.8.54 లక్షలు, భక్తరహళ్లి నరసంహస్వామి హుండీ నుంచి రూ.12.5 లక్షలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

### సీడీపీఓ నాగమల్లీశ్వరి

అగళి, జూలై 8(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సీడీపీఓ నాగమల్లీశ్వరి, జడ్పీటీసీ ఉమేష్ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం గ్రామస్థాయి బాల్య వివాహ నిరోధక కమిటీ సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్, మహిళా శిశుసంక్షేమ శాఖ పీడీ శ్రీదేవి ఆదేశాల మేరకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని సూపర్‌వైజర్ లీలావతి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బారావు, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఏఎస్ఐ శ్రీరాములు పాల్గొన్నారు.

### 'పండ్లతోటల పెంపకాన్ని సద్వినియోగం చేసుకోండి'



అగళిలో మొక్కలు నాటుతున్న టీడీపీ నాయకులు, రైతులు

అగళి, జూలై 8(ఆంధ్రజ్యోతి): రైతులు పండ్లతోటల పెంపకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ ఉమేష్, కన్వీనర్ మధుడి తిప్పేస్వామి సూచించారు. మంగళవారం మండలంలోని రామనపల్లి పంచాయతీ కురుసాంగనపల్లి గ్రామంలో రైతు హనుమంతరాయప్ప పొలంలో పండ్లతోటల పెంపకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండ్లతోటల పెంపకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కిష్టప్ప, ఎంపీపీ రేణుక, కామరాజ్, శివరాజ్ పాల్గొన్నారు.

పరిగి(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కాలువపల్లి గ్రామానికి చెందిన కిష్టప్ప అనే రైతు పొలంలో పండ్లతోటల పెంపకాన్ని కన్వీనర్ గోవిందరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మామిడి మొక్కలను నాటారు. వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలాజీ, జిల్లాయువత కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సోమప్ప, అరుణ, కోటప్ప తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షలు

### ఎంపీ బీకే పార్థసారథి



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

అమరాపురం, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండులో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షల నిధులను మంజూరుచేస్తున్నట్లు ఎంపీ బీకే పార్థసారథి పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం సుపరిపాలనకు తొలిఅడుగు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీ బీకే పార్థసారధి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొలాల్లోకి వెళ్లి వారు మొక్కలు నాటారు. వాటిని సంరక్షించాలని రైతులకు సూచించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. పథకాలు అందుతున్నాయా..? లేదా..? అన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులకు ఎటువంటి పరిస్థితుల్లో అన్యాయం జరగదని భరోసా ఇచ్చారు. సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, మండల కన్వీనర్ కృష్ణమూర్తి, జడ్పీటీసీ సారక్క, జయకుమార్, ఏపీడీ శివానందనాయక్, ఎంపీడీఓ రామారావు, ఏపీఓ శివన్న, జేఈ జగదీశ్, టెక్నికల్ అసిస్టెంట్లు, నరసింహమూర్తి, నాయకులు శివ, రుద్రప్ప, మాజీ జడ్పీటీసీ నరసింహార్తి పాల్గొన్నారు.

## మహిళల సంక్షేమం చంద్రన్నతోనే సాధ్యం

### ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సతీమణి ఉమాదేవి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఉమాదేవి

మడకశిర టౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మహిళల అభివృద్ధి సీఎం చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సతీమణి ఉమాదేవి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని 3వ వార్డు, పావగడ రోడ్డులో సుపరిపాలనకు తొలిఅడుగు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నాగరాజు. నగర పంచాయతీ చైర్మన్ వెంకటలక్ష్మమ్మ, మాజీ చైర్మన్ రాధమ్మ, క్లస్టర్ ఇన్‌చార్జి రవికుమార్, కౌన్సిలర్లు ఉమాశంకర్, నరసింహరాజు పాల్గొన్నారు.

### డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బోయగేరి సమీపంలో రూ.22 లక్షలతో డ్రైనేజీ నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేసినట్లు మండల కన్వీనర్ శ్రీరాములు తెలిపారు. సుపరిపాలనకు తొలిఅడుగులో భాగంగా స్థానికులు మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ సురేష్‌కుమార్, రూరల్ కన్వీనర్ ప్రసాద్, మాజీ సర్పంచ్ అశ్వర్థప్ప, బీజేపీ రామక్రిష్ణ, పాలడుగు చంద్ర, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, నరేంద్ర పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

గోరంట్ల: మండల కేంద్రంలోని సంతమార్కెట్ వీధిలో మంగళవారం కన్వీనర్ బాలకృష్ణ, బూత్ కన్వీనర్ అజంతుల్లా ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

### 'పార్టీ అనుబంధ సంఘాలను బలోపేతం చేస్తాం'

చిలమత్తూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీ అనుబంధ సంఘాల పునర్నిర్మాణం చేపడతామని మండల టీడీపీ కన్వీనర్ ఎగువింటి శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలో పార్టీ పటిష్టతకు చర్యలు చేపడతున్నామన్నారు. ప్రధానంగా ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హునికి అందేలా చేస్తామన్నారు. త్వరలో ఎమ్మెల్యే బాలకృష్ణ అనుబంధ సంఘాలను ప్రకటిస్తారన్నారు.

## కోర్టుకు హాజరైన మున్సిపల్ చైర్మన్



కోర్టు బయట నాయకులు

హిందూపురం, జూలై8(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చైర్మన్ రమేష్, మరికొందరు నాయకులు మంగళవారం కోర్టుకు హాజరయ్యారు. గోరంట్ల మాధవ్ హిందూపురం ఎంపీగా ఉన్న సమయంలోఓ మండలంలో ఓ కార్యక్రమానికి వెళ్తుండగా రమేష్, నాయకులు చంద్రమోహన్‌యాదవ్, రాఘవేంద్ర, నవీన్, శివశంకర్ అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో అప్పట్లో హిందూపురంలోని పోలీస్ స్టేషన్‌లో వీరిపై కేసు నమోదైంది. ఆ కేసుకు సంబంధించి మంగళవారం స్థానిక కోర్టుకు వీరు హాజరయ్యారు.

### 'తల్లిదండ్రులను ఆహ్వానించండి'

రొద్దం, జూలై 8(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఈనెల 10న జరిగే మెగా పేరెంట్స్‌డేకు తల్లిదండ్రులను ఉపాధ్యాయులు ఆహ్వానించాలని తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు, ఎంఈఓ జయభాస్కర్ సూచించారు. మంగళవారం రొద్దం మండల పరిధిలోని కళాశాల ప్రిన్సిపాల్, పాఠశాల హెచ్ఎంలకు సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్‌డేను ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా తీసుకుని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణమ్మ, లక్ష్మీ, ప్రిన్సిపాల్ మద్దిలేటి పాల్గొన్నారు.